Follow: @ANNTELUGU

ANN తెలుగు

06-06-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 184 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హైదరాబాద్‌లో రఫేల్ విడిభాగాల ఉత్పత్తి

### రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన భాగాల తయారీపై ఒప్పందం

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ మధ్య డీల్

2028 ఆర్థిక సంవత్సరం నాటికి తయారీ ప్రారంభం లక్ష్యం

ఫ్రాన్స్ వెలుపల రఫేల్ విడిభాగాల తయారీ ఇదే మొదటిసారి

వివరాలు 2లో

టాప్ న్యూస్

### ఎక్స్ చాట్ ప్రారంభించిన మస్క్

వాట్సాప్ ఇన్‌స్టా ఇక ఖతం?



02

### నేడు కమిషన్ ముందుకు ఈటల!


- కాళేశ్వరం ఇన్వెస్టిగేషన్‌కు హాజరుకానున్న ఎంపీ
- ఈటలను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్న పీసీ ఘోష్ కమిషన్
- గతంలో నిర్వర్తించిన బాధ్యతల ఆధారంగా ప్రశ్నవళి సిద్ధం
- ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పాత్రపై కమిషన్ ఆరా
- 9న విచారణకు రానున్న హరీశ్ రావు.. 11న అటెండ్ కానున్న కేసీఆర్



02

### బీద రైతుల కడుపు కొడుతారా?

- ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతారు
- ధన్వాడ రైతులపై దాడి చేసిన వారిపై కేసులెందుకు పెట్టలేదు
- కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి
- కేంద్ర మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలే
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు



02



## ఆర్సీబీ, కేఎస్‌సీఏపై ఎఫ్ఐఆర్

- బెంగళూరు తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం
- హైకోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోలీసులు
- మరోవైపు ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేసిన ప్రభుత్వం

వివరాలు 7లో



## నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలి

- అందుకు స్పెషల్ ఆఫీసర్‌ని నియమించండి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

వివరాలు 3లో

National Human Rights Commission

## సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

- తెలంగాణ డీజీపీ జితేందర్‌కు సైతం జారీ
- రాజేంద్రనగర్ పీఎస్‌లో యువకుడి మృతి నేపథ్యంలో
- రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం

వివరాలు 3లో

## త్వరలోనే బాలికా రక్షక టీం

- మహిళల భద్రత కోసం పటిష్ట విధానాలు
- మేధో మధన ముగింపు సభలో మంత్రి సీతక్క ప్రకటన

వివరాలు 3లో



# రెండు డీఏలకు గ్రీన్ సిగ్నల్

## ఉద్యోగులకు సర్కార్ భారీ గుడ్ న్యూస్

### తక్షణమే ఒక డీఏ అమలు, ఆరు నెలల్లో మరొకటి ఇస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

- మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు ప్రమాద బీమా
- లోన్ బీమా చెల్లింపుల కోసం రూ.70 కోట్లు కేటాయింపు
- సన్న వడ్లకు రూ.500 బోనస్ కొనసాగింపు
- ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని నిర్ణయం
- 86.1 కిలోమీటర్లు.. రూ. వేల 75 కోట్లతో ఫేజ్ 2 మెట్రో విస్తరణ
- కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు
- ములుగు జిల్లా ఇంచర్లలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి 12 ఎకరాలు కేటాయింపు
- కీలక నిర్ణయాలు తీసుకున్న తెలంగాణ క్యాబినెట్
- నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి
- ఐదు గంటల పాటు జరిగిన సమావేశం.. అనేక అంశాలపై డిస్కషన్

**హైదరాబాద్, మహా:** ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త తెలిపింది. రెండు డీఏలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. తక్షణమే ఒక డీఏ ఇస్తున్నట్లు తెలిపారు. రెండో డీఏను మరో 6 నెలల్లో ఇస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో పలు ముఖ్యమైన ప్రజా సంక్షేమ పథకాలపై చర్చించారు. అనంతరం క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2బీకి కూడా ఆమోదం తెలిపింది.

మిగతా 2లో

# వెంటిలేటర్‌పై ఎమ్మెల్యే మాగంటి

### అత్యంత విషమంగా ఆరోగ్యపరిస్థితి

**సర్దార్ మరణమే కుంగుదీసింది- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**

ఐసీయూలో ఉన్నారు.. చికిత్స కొనసాగుతోంది మాజీ మంత్రి హరీష్ రావు

ఈ 48 గంటలు చాలా క్రిటికల్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్


జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ క్యాడర్ లో ఆందోళన

కోలుకోవాలని అనుచరులు, అభిమానుల ప్రార్థనలు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేర్చారు. గుండెపోటు కారణంగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. వైద్యులు ఆయన్ని అత్యవసర విభాగంలో ఉంచి చికిత్స చేస్తున్నారు. ప్రస్తుతం మాగంటి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారని తెలియటంతో మాజీ మంత్రి హరీష్ రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాగంటి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిపై హరీష్ రావు స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే మాగంటి ఐసీయూలో ఉన్నారు. ఆయనకు చికిత్స కొనసాగుతోంది' అని తెలిపారు.

**వెంటిలేటర్‌పై చికిత్స**

మాగంటి గోపీనాథ్ తన అనారోగ్యంతో సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. గత నాలుగు నెలలుగా ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని నెలల క్రితం నిర్వహించిన వైద్య పరీక్షలలో ఆయనకు మూత్రపిండాలు పూర్తిగా పనిచేయడం లేదని (కిడ్నీ ఫెయిల్యూర్) నిర్ధారణ అయింది.



మిగతా 2లో

## ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్యంపై కేటీఆర్ ఆరా

- కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మాజీ మంత్రి
- చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్న బీఆర్ఎస్ నేత



వివరాలు 2లో

## సెక్రటేరియట్‌లో కళ్ళు తిరిగి పడిపోయిన మంత్రి కొండా సురేఖ

- వైద్య పరీక్షల అనంతరం నిలకడగానే మంత్రి సురేఖ ఆరోగ్యం
- లో బీపీ కారణంగా కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి

03



## విత్తన కార్యక్రమం సక్సెస్

- 35 వేల మంది అభ్యుదయ రైతులకు పంపిణీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



03

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సుధాకర్ హతం

40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సింహాచలం

నరసింహా అలియాస్ సుధాకర్‌పై రూ. లక్షా 50 వేల రివార్డు

2004 ప్రభుత్వంతో శాంతి చర్చల్లో పాల్గొన్న అగ్రనేత

**మహా:** వరుస ఎన్ కౌంటర్‌లతో భారీగా కేడర్‌ను కోల్పోతున్న మావోయిస్టులకు మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. తాజాగా బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్ మృతి చెందారు. గురువారం ఉదయం నుంచి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు జరుగుతున్న ఎదురుకాల్పుల్లో సుధాకర్ మృత్యువాత పడ్డారు. ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్టల పేరుతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం చర్యలు చేపట్టింది. తమతో చర్చలు జరపాలనే మావోయిస్టు పార్టీ ఇదివరకే విజ్ఞప్తి చేసినా ఆ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు.



మిగతా 2లో

# అర్హతల ప్రకారం పదవులు

### పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఆ బాధ్యత నేతలు, కార్యకర్తలపైనే ఉంది
- ప్రజలతో లీడర్లు అనుసంధానంగా పని చేయాలి
- కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం, భూ భారతి పట్ల మంచి స్పందన: టీపీసీసీ చీఫ్
- వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నేతలతో సమావేశం
- ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు



**మహా:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నేతలు, కార్యకర్తలపైనే ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యకర్తలు - నాయకులు ప్రజలతో అనుసంధానంగా పని చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నేతలతో టీపీసీసీ చీఫ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇంచార్జ్

మిగతా 2లో

# అర్హతల ప్రకారం పదవులు



(మొదటిపేజీ తరువాయి)

మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేంపల్లి నరేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కమిటీల ఆలస్యం వల్ల కార్యకర్తల్లో నైరాశ్యం చెందిన మాట వాస్తవమని అంగీకరించారు. త్వరలోనే అర్హతల ప్రకారం పదవులు ఇస్తామని నేతలకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 17 నెలల కాంగ్రెస్ పాలనతో పాటు.. ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు.. ఎమ్మెల్యేలపై ప్రభావం చూపే అవకాశముందని చెప్పారు. మీనాక్షి నటరాజన్.. తెలంగాణ ఇంచార్జ్‌గా రావడం అందరి అదృష్టమన్న మహేశ్ గౌడ్.. చురుకైన నాయకుల్ని పీసీసీ అబ్జర్వర్లతో గుర్తించి తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. పార్టీకి ప్రభుత్వానికి నాయకులు వారధి కావాలని పేర్కొన్నారు. సీనియర్, జూనియర్ల సమన్వయంతో పని చేయాలని అన్నారు. కులసర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం, భూ భారతి పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని చెప్పుకొచ్చారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా తెలంగాణ కాంగ్రెస్ పథకాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# వెంటిలేటర్‌పై ఎమ్మెల్యే మాగంటి

(మొదటిపేజీ తరువాయి)

అప్పటినుంచి ఆయన నిరంతరం వైద్య చికిత్సలు తీసుకుంటూనే ఉన్నారు. అయితే.. గత నాలుగు రోజులుగా ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో, కుటుంబ సభ్యులు ఆయన్ని అత్యవసరంగా గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య నిపుణులు ఆయనకు అత్యున్నత స్థాయి వైద్య సహాయం అందిస్తున్నారు. కీలకమైన అవయవాలు ఎలా స్పందిస్తున్నాయో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వర్గాలు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ, అంతర్గత సమాచారం ప్రకారం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రజా నాయకుడి కోసం ప్రార్థనలు..**

మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక బలమైన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన



ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతున్న అభిమానులు, కార్యకర్తలు ఆయన త్వరగా కోలుకోవాలని, మళ్లీ ప్రజాసేవలో కొనసాగాలని ప్రార్థిస్తున్నారు. రాజకీయ ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం అడిగి తెలుసుకుంటూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే గోపీనాథ్ చనిపోలేదు, ఈ 48 గంటలు చాలా క్రిటికల్- ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్**

బీఆర్ఎస్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి క్రిటికల్ గా ఉందని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ అన్నారు. 48 గంటలు గడిస్తేనే పరిస్థితి తెలుస్తుందని డాక్టర్లు చెప్పారని ఆయన తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావ్ ఆసుపత్రిలో ఉండి డాక్టర్లతో నిరంతరం మాట్లాడుతున్నారని వెల్లడించారు. పార్టీ వర్గాలు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. మాగంటి గోపీనాథ్ చనిపోలేదని, ఆయన పరిస్థితి క్రిటికల్ గా ఉందని దాసోజు శ్రావణ్ స్పష్టం చేశారు. గోపీనాథ్ కోలుకోవాలని ప్రజలు, పార్టీ శ్రేణులు పూజలు చేయాలని కోరారు. మాగంటి గోపీనాథ్ పరిస్థితి చాలా క్రిటికల్ గా ఉందని ఎమ్మెల్యే వివేకానంద తెలిపారు. గుండె సంబంధిత సమస్యలతో పాటు కిడ్నీ సమస్యతో గోపీనాథ్ ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఏఐజి వైద్య నిపుణులు ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ 48 గంటలు చాలా క్రిటికల్ అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామన్నారు. ప్రస్తుతం మాగంటి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ఎమ్మెల్యే వివేకానంద చెప్పారు.

## ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ ఆరా

**కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మాజీ మంత్రి.. చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు**

**మహా:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ కేటీఆర్ ఆరా తీశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్.. గోపీనాథ్ కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రి వైద్య బృందంతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మాగంటి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న నేపథ్యంలో వారి కుటుంబానికి అండగా ఉండేందుకు కేటీఆర్.. తన అమెరికా పర్యటనను కుదించుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు. కాగా అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి.. ఆయనకు అందిస్తున్న చికిత్స వివరాలను ఫోన్ ద్వారా ఆసుపత్రి సీనియర్ వైద్యులను అడిగి తెసుకున్నారు. ఐసీయూలో మాగంటికి చేస్తున్న వైద్యంపై పూర్తి సమాచారం తీసుకున్నారు. గోపీనాథ్‌కు అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్నామని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని ఏఐజి వైద్య బృందం కేటీఆర్‌కు వివరించింది. ఈ సందర్భంగా మాగంటి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేటీఆర్ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# రెండు డీఏలకు గ్రీన్ సిగ్నల్



(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన, ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల వివరాలు క్యాబినెట్‌కి తెలియజేశారు. ఉద్యోగుల 57 డిమాండ్లను మే 6న ఏర్పాటైన అధికారుల కమిటీ సమీక్షించి నివేదిక సమర్పించింది. వాటిలో పలు డిమాండ్లను ఆమోదించగా, మిగతావాటిపై మరింత సమీక్షకు తీర్మానం చేయడం జరిగింది. ఉద్యోగుల బకాయిలు చెల్లింపును వ్యవస్థబద్ధంగా అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున బకాయిల చెల్లింపులు జరపనుంది.

**కేబినెట్ నిర్ణయాలివే..**

మెట్రో రెండో విడత విస్తరణపై తెలంగాణ కేబినెట్‌లో చర్చ జరిగింది. ములుగు జిల్లా ఇంచర్లలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి 12 ఎకరాలు కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యుల ప్రమాద బీమా ఇవ్వాలని నిర్ణయించింది. లోన్ బీమా చెల్లింపుల కోసం రూ.70 కోట్లు చెల్లిస్తూ ఆమోదముద్ర వేసింది. హామ్ విధానంలో గ్రామీణ రోడ్ల ఆధునీకరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఉద్యోగుల ఆరోగ్య బీమాకు సంబంధించి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది. ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల పెండింగ్ బకాయిలను నెలకు రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నామని మంత్రులు తెలిపారు. పెండింగ్ బకాయిలను నెలల వారీగా క్లియర్ చేసేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10లక్షలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అలాగే ఆర్అండ్‌బీ పరిధిలో 5,100 కి.మీ, పంచాయతీరాజ్ పరిధిలో 7,947 కి.మీ రహదారులు ఆధునీకరించడంతో పాటు కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్శిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు మంత్రివర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు.

**హెల్త్ కేర్ ట్రస్ట్, ఆరోగ్య కార్డుల జారీ..**

ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో అధికారులు, సంఘ ప్రతినిధులు ట్రస్టీలుగా ఉంటారు. ఈ ట్రస్ట్ ద్వారా ఆరోగ్య కార్డులు జారీ చేయనున్నారు.

**పదోన్నతుల కోసం సెప్టెంబర్‌లో డీపీసీలు..**

ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే, రాష్ట్ర స్థాయి వైద్య అంగవైకల్య కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. జాయింట్ స్టేట్ కౌన్సిల్, ఇతర ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వనున్నారు. జీవో 317 పరిధిలో కొత్త కేటగిరీలను చేర్చనున్నారు. రోడ్ల అభివృద్ధికి రూ.33,194 కోట్లు హైబ్రిడ్ అన్యుయిటీ మోడల్ ద్వారా 13,137 కి.మీ రోడ్ల అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 7,947 కి.మీ పంచాయతీరాజ్ రోడ్లకు రూ.16,780 కోట్లు, 5,190 కి.మీ ఆర్ అండ్ బి రోడ్లకు రూ.16,414 కోట్లు ఖర్చు చేయనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాలు లేదా గత జిల్లాల ఆధారంగా రోడ్ ప్యాకేజీలు రూపొందించనున్నారు. నిర్మాణానికి రెండు సంవత్సరాలు, నిర్వహణకు 15 సంవత్సరాల పాటు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు.

**2004లో ప్రభుత్వంతో చర్చల్లో..**

మావోయిస్టు కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఉన్న హిడ్మాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయగా, తాజాగా మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతిచెందడం మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. సుధాకర్ కేంద్ర కమిటీలో కీలక సభ్యుడిగా ఉన్నారు. అయితే గత ఆరు నెలల్లో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు పోలీసుల ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. మరోవైపు సుధాకర్‌పై రూ. 1 లక్షా 50 వేల రివార్డ్ కూడా ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో సుధాకర్ పాల్గొన్నారు. కాగా, వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టుల లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఇందులో ఆపరేషన్ కగార్ ఒకటి. ఇది గత ఏడాది నుంచి ఊపందుకోగా, ఈ ఆపరేషన్ అనేక మంది మావోయిస్టుల కీలక నేతలు హతమయ్యారు. దేశవ్యాప్తంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం తన చర్యలను ముమ్మరం చేసింది.

# హైదరాబాద్‌లో రఫేల్ విడిభాగాల ఉత్పత్తి

**రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన భాగాల తయారీపై ఒప్పందం**

**టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ మధ్య డీల్**

**2028 ఆర్థిక సంవత్సరం నాటికి తయారీ ప్రారంభం లక్ష్యం**

**ఫ్రాన్స్ వెలుపల రఫేల్ విడిభాగాల తయారీ ఇదే మొదటిసారి**

**మహా :** భారత రక్షణ రంగంలో స్వావలంబన దిశగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో మరో ముందడుగు పడింది. భారత వైమానిక దళానికి వెన్నెముకగా ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు చెందిన అత్యంత కీలకమైన భాగాలను ఇకపై హైదరాబాద్‌లో తయారు చేయనున్నారు. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన విడిభాగాలను హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తారు. రఫేల్ విమాన భాగాలను ఫ్రాన్స్ వెలుపల తయారు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఏరో స్పేస్ రంగంలో భారతదేశం సాధిస్తున్న ప్రగతికి, పెరుగుతున్న తయారీ సామర్థ్యానికి ఈ ఒప్పందం ఒక నిదర్శనంగా నిలుస్తుంది.

2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ విడిభాగాల ఉత్పత్తిని ప్రారంభించాలని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం అవసరమైన ఏర్పాట్లను సంస్థ వేగవంతం చేయనుంది. ఈ సందర్భంగా డసో ఏవియేషన్ ఛైర్మన్ అండ్ సీఈవో ఎరిక్ ట్రాపియర్ మాట్లాడుతూ, "భారత్‌లో మా కార్యకలాపాల



ను మరింత విస్తరించడంలో ఇది ఒక నిర్ణయాత్మక ముందడుగు. భారత రక్షణ రంగానికి మా సేవలను అందించే అవకాశాన్ని మరింతగా పెంచుతున్నందుకు సంతోషిస్తున్నాం. ఈ నిర్ణయం ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తూ సైనిక అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది" అని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) సీఎండీ సుకరన్ సింగ్ ఈ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. "భారత రక్షణ రంగ చరిత్రలో ఇది ఒక మైలురాయి వంటిది. డసో ఏవియేషన్‌తో కుదిరిన ఈ ఒప్పందం, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ తయారీ నైపుణ్యాలను, సామర్థ్యాలను మరోసారి ప్రపంచానికి తెలియజేస్తుంది. భారతదేశ వైమానిక, రక్షణ వ్యవస్థల అభివృద్ధిలో ఇది ఒక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

# రెండు ముక్కలైన బీఆర్ఎస్

- కవిత మహాధర్నాతో క్లారిటీ
- కేసీఆర్ కోసం ధర్నా చేస్తే కానరాని బీఆర్ఎస్ శ్రేణులు
- హైకమాండ్ ఆదేశంతోనే దూరంగా ఉన్నారని టాక్

**మహా :** పదేళ్ళు తెలంగాణ రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన బీఆర్ఎస్ పార్టీ రెండుగా చీలిపోయింది. కవిత చేపట్టిన మహాధర్నా సాక్షిగా ఇది నిరూపితమైంది. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ కవిత నేతృత్వంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. తెలంగాణ జాగృతి అధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ హాజరు కాలేదు. కేవలం కవిత కోటరీ, జాగృతికి సంబంధించిన నేతలు మాత్రమే హాజరయ్యారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ నేతలు ఎందుకు దూరంగా ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కవిత ధర్నాకు వెళ్లవద్దని పార్టీ హైకమాండ్ నుంచి సంకేతాలు రావడంతోనే నేతలు వెనక్కి తగ్గారని టాక్ బయటకు వచ్చింది.

అయితే ఈ నిర్ణయాన్ని పార్టీ నేతలు కొంతమంది తప్పుబడుతున్నారు. కేసీఆర్ కు కమిషన్ నోటీసులు ఇవ్వడంతో కవిత ధర్నాకు చేపట్టారని, అలాంటప్పుడు ఆ ధర్నాలో పాల్గొనవద్దని ఆదేశాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని పార్టీ అంతర్గత వ్యవహారంగా ఎందుకు ట్రీట్ చేస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీలో కవిత రేపిన కాక బీఆర్ఎస్‌ను రెండు ముక్కలు చేసేదిలా ఉందన్న వాదనకు తాజా కార్యక్రమం బలం చేకూర్చుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ గొడుగు కింద రాజకీయాలు చేసేందుకు కవిత అనాసక్తిగా చూపిస్తున్నారు. తన పవర్ ఏంటో చూపించాలని ఆమె ఆరాటపడుతున్నారు. ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తున్నారు. ఒకవేళ పార్టీని ఏర్పాటు చేసినా కేసీఆర్ చరిష్మాను వాడుకోవాలని ఫిక్స్ అయ్యారు. అందుకే బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా జాగృతి ఆధ్వర్యంలో కేసీఆర్ కు మద్దతుగా మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ద్వారా బీఆర్ఎస్ రెండుగా చీలిపోయిందని స్పష్టం అవుతోంది.

# నేడు కమిషన్ ముందుకు ఈటల!

- కాళేశ్వరం ఇన్వెస్టిగేషన్‌కు హాజరుకానున్న ఎంపీ
- ఈటలను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్న పీసీ ఘోష్ కమిషన్
- గతంలో నిర్వర్తించిన బాధ్యతల ఆధారంగా ప్రశ్నవళి సిద్ధం
- ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పాత్రపై కమిషన్ ఆరా
- 9న విచారణకు రానున్న హరీశ్ రావు.. 11న అటెండ్ కానున్న కేసీఆర్

**మహా:** కాళేశ్వరం కమిషన్ ఎదుట నేడు మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాజరుకానున్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సైతం ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది. అయితే మాజీ సీఎం కేసీఆర్‌ను ఈ నెల 5వ తేదీన విచారణకు రావాలని ఆదేశించగా.. ఆయన 11న అటెండ్ అవుతానని రిక్వెస్ట్ చేయగా.. కమిషన్ అంగీకరించింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది. దీంతో నేడు ఈటల రాజేందర్ కమిషన్ ఎదుట హాజరుకానున్నారు.

**నోటీసులకు భయపడ: ఈటల**

ఇప్పటికే నోటీసుల అంశంపై బీజేపీ ఎంపీ,



మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తాను నోటీసులకు భయపడబోనని, కేసీఆర్ హయాంలో జరిగిన విషయాలను అవసరమైతే వెల్లడిస్తానని ఆయన హెచ్చరిక ధోరణిలో వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనతో పాటు మంత్రులుగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కడియం శ్రీహరి వంటి నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, వారికి అప్పటి పరిస్థితులు తెలియవా అని ఈటల ప్రశ్నించారు. కేసీఆర్‌తో విభేదించడానికి అందరూ జంకుతున్న రోజుల్లోనే తాను ఆరు నెలల పాటు ఎలా పోరాటం చేశానో తెలంగాణ సమాజం మొత్తం చూసిందని, కాబట్టి ఇలాంటి నోటీసులకు తాను భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, వాటి పర్యవసానాల గురించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరినవారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

# బీద రైతుల కడుపు కొడుతారా?

## ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతారు

- ధన్వాడ రైతులపై దాడి చేసిన వారిపై కేసులెందుకు పెట్టలేదు
- కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి
- కేంద్ర మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలే
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

**మహా:** బీద రైతుల కడుపుకొట్టి బడా పారిశ్రామికవేత్తలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తనకు నచ్చిన బడాబాబుల కోసం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ భూములను బలవంతంగా సేకరించే బాధ్యతను సీఎం భుజాన వేసుకోవడంతో రైతులపై తరచుగా ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ బౌన్సర్లతో పాటు పోలీసులు కూడా రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని ఎక్స్‌లో మండిపడ్డారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే రేవంత్ రెడ్డి తన జిల్లాలోనే ఘటన జరిగి 24 గంటలు అవుతున్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పోలీసులు 12 గ్రామాల రైతులను కొట్టి, 40 మందిపై కేసులు పెట్టి, 12 మంది రిమాండ్‌కి పంపించడం దుర్మార్గమన్నారు. రైతులను కొట్టించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానిపై కానీ, బౌన్సర్లపై కానీ ఎందుకు కేసులు పెటలేదో చెప్పాలని రేవంత్ సర్కారుని ప్రశ్నిస్తున్నానన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకించిన లంబాడా రైతులకు బేడీలు వేసిన ఘటనపై కేంద్ర మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలేదని మండిపడ్డారు.

**ఒక్క పని చేయడం లేదు..**

నిర్మల్ జిల్లా దిలావర్పూర్‌లో కూడా ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన రైతులను కొట్టారని, మీ రియల్ ఎస్టేట్ దందాలు పెంచుకోవడానికి 6 లైన్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ విషయంలో కూడా రైతులపై కేసులు పెట్టారని మండిపడ్డారు. మేము అధికారంలోకి వస్తే ఫార్మా సిటీ భూములు తిరిగిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చి తిరిగి అదే రైతులపై కేసులు పెట్టావని మండిపడ్డారు. జహీరాబాద్ న్యాలకల్ రైతులపై విచక్షణారహితంగా దాడి చేసి



అక్రమ కేసులు పెట్టించావని, సూర్యాపేట జిల్లా చిలకలూరు గ్రామం రైతులు రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తే 42 మందిపై కేసులు పెట్టి పోలీస్ జులుం చూపించావని రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మండిపడ్డారు. ధాన్యం కోతలను ప్రశ్నించినందుకు నిర్మల్ జిల్లా ఏర్పచింతలో రైతులపై కేసులు పెట్టారన్నారు. ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతావ్ రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. రైతులకు, ప్రజలకు పనికి వచ్చే ఒక్క పని చేయడం లేదు కానీ, పెద్దలకు మాత్రం భూములను కట్టబెడుతావని.. రైతులను కొట్టు కమిషన్లు పట్టు అనే విధంగా సాగుతుంది నీ పాలన అని మండిపడ్డారు. తెలంగాణ రైతు లోకం తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే శరణ్యం

**అమ్మ పేరుతో మొక్క నాటండి**

- మొక్కను కాపాడుకుంటే అమ్మను కాపాడుకున్నట్లే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- న్యూఢిల్లీలోని తన నివాసంలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి

**మహా :** వాతావరణ మార్పులపై పోరాటానికి, భవిష్యత్ తరాల పరిరక్షణకు మొక్కలు నాటడమే శరణ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. అందులో భాగంగా భారతీయ పౌరులందరూ తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటి పర్యావరణ



పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఉదయం న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బండి సంజయ్ మొక్కలు నాటారు. తన కార్యాలయ సిబ్బందితో మొక్కలు నాటించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. మొక్కల పెంపకం ద్వారా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. వాతావరణ మార్పులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అట్లాగే జీవ వైవిధ్య పరిరక్షణ, భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించేందుకు మనమంతా సామూహిక బాధ్యతగా భావించాలని అభిప్రాయపడ్డారు. అందులో భాగంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగితోపాటు ప్రతీ భారతీయ పౌరుడు "ఏక్ పేడ్ మా కే నామ్" నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ అనేది ఇంటి నుంచే ప్రారంభమవుతుందని, తల్లుల అనురాగానికి, పోషణకు గుర్తుగా మొక్కలు నాటడం ఒక అర్థవంతమైన నివాళి అవుతుందని చెప్పారు.

# విత్తన కార్యక్రమం సక్సెస్

## 35 వేల మంది అభ్యుదయ రైతులకు పంపిణీ.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**మహా:** గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ఎంపిక చేయబడిన అభ్యుదయ రైతులకు ఆయా జిల్లాల మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా విత్తన పాకెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. గురువారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఇప్పటివరకు సుమారు 2500 క్వింటాళ్ల నాణ్యమైన మూల విత్తనాన్ని రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేయబడిన 35 వేల మంది అభ్యుదయ రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వరిలో 20 వేలు, జొన్నలో 1,522, కందిలో 4,568, పెసరలో 8,910 విత్తన కిట్లను రైతాంగానికి అందించడం జరిగిందన్నా



రు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 2,192 కిట్లను, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లాలో అత్యల్పంగా 379 విత్తన కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ నాణ్యమైన విత్తనాన్ని అందుకున్న రైతులు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి వచ్చిన దిగుబడిని గ్రామంలోని ఇతర రైతులకు పంపిణీ చేయడం ద్వారా రానున్న రెండు, మూడు సంవత్సరాలలో ప్రతీ గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతాంగానికి నాణ్యమైన విత్తనం అందించాలనే లక్ష్యంతో గత నాలుగు నెలలుగా ప్రణాళికలు సిద్ధం చేసి, అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి రైతు ప్రయోజనకరమైన వినూత్న కార్యక్రమాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు మరిన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతితో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను అభినందించారు.



# నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలి

- అందుకు స్పెషల్ ఆఫీసర్‌ని నియమించండి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

**మహా:** నిధుల సమీకరణపై అధికారులు తీవ్రంగా దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సబ్ కమిటీ సభ్యుడు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ప్రతివారం జరుగుతుందని, తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. తాజా సమావేశంలో రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్‌కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో శాఖల వారీగా అంశాలను డిప్యూటీ సీఎం సుదీర్ఘంగా సమీక్షించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి, ఆర్‌వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు


## తెలంగాణ డీజీపీ జితేందర్‌కు సైతం జారీ

### రాజేంద్రనగర్ పీఎస్‌లో యువకుడి మృతి నేపథ్యంలో రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం

**మహా:** హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడు మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ దురదృష్టకర సంఘటనకు సంబంధించి మీడియాలో వెలువడిన కథనాలను సుమోటోగా స్వీకరించిన కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పోలీసుల వేధింపుల కారణంగానే ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లుగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్సీ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించింది. ఈ నోటీసులకు రెండు వారాల్లోగా స్పందించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఆర్సీ స్పష్టం చేసింది. యువకుడి మృతికి దారితీసిన పరిస్థితులు, పోలీసులపై వచ్చిన ఆరోపణలపైన లోతైన విచారణ జరిపి, వాస్తవాలను నివేదించాలని కోరింది.

**ఏం జరిగిందంటే..**

నగరంలోని టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలుండగా.. మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో విషయం తెలుసుకున్న రెండో భార్య నిలదీసింది. ఈ విషయంపై భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అలాగే మే 13న కూడా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా.. అది




ఎంతకీ తెగకపోవడంతో ఇరు వర్గాలు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తను లోపలికి తీసుకెళ్లిన పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇర్ఫాన్ కుప్పకూలిపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అయితే పోలీసులు కొట్టడం వల్లే అతడు మరణించాడంటూ ఇర్ఫాన్ సోదరుడు ఆరోపించాడు. ఇర్ఫాన్‌ను తాము కొట్టలేదని పోలీసులు తెలిపారు. పోలీసుల టార్చర్ వల్లే యువకుడు మృతి చెందాడంటూ మీడియాలో కథనాలు రావడంతో ఈ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

# వికసితకృషి సంకల్ప్ అభియాన్.. వికసిత భారత్‌కు పునాది

## ప్రయోగశాల నుంచి పొలానికి మంత్రం...
## వికసితకృషి సంకల్ప్ అభియాన్‌తో సఫలం

ప్రధానమంత్రిశ్రీ నరేంద్ర మోదీ సమర్థనాయకత్వాన భారత వ్యవసాయ రంగంస్థిరంగా పురోగమిస్తోంది. రైతుసంక్షేమమే పరమావధిగా గల ఆయనదార్శనిక విధానాలు,చారిత్రకనిర్ణయాలు మన రైతు సోదరీసోదరులకుసాధికారతనిచ్చాయి. అంతేగాక 'వికసిత భారత్' మహా సంకల్పాన్నిబలోపేతం చేశాయి. ఈరోజున మన అన్నదాతలు దేశ ఆహారభద్రతకు భరోసా ఇవ్వడమేగాకఅనేక దేశాలకు ఆహార ధాన్యాలఎగుమతి ద్వారా భారత్ ప్రతిష్ఠనుకూడా ఇనుమడింపజేస్తున్నారు. 'ఒకే దేశంఒకేజట్టుఒకేవ్యవసాయం' నినాదం ప్రాతిపదికనరాష్ట్రాలతోసంయుక్తంగా కృషిచేయడమే నేటి మా లక్ష్యం. ఆమేరకు ప్రయోగశాలల్లో సాగేవ్యవసాయ పరిశోధనలను సకాలంలోపంట పొలాలకు చేర్చడం ద్వారావ్యవసాయ ఆధునికీకరణ,రైతుస్వావలంబన సాధించడమే మనధ్యేయాలు.

వ్యవసాయం,రైతులేదేశ సౌభాగ్యానికి పునాది. మనవ్యవసాయ శాస్త్రవేత్తలు అనేకఅధ్యయనాల ద్వారా ఆధునిక యుగసాంకేతికతలను రూపొందిస్తున్నారు. మెరుగైనవిత్తనాలు,ఎరువులద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువదిగుబడి సాధించేందుకు కృషిచేస్తున్నారు. అయితే,ఈపరిశోధన ఫలితాలను ప్రయోగశాలలనుంచి పంట పొలాలకు సకాలంలో చేర్చడం కూడా అత్యంత కీలకం. ఈనేపథ్యంలో వాతావరణ మార్పుప్రభావం,భూసారపోషకాలు,ఎరువులసముచిత వినియోగం తదితరాలపైరైతులకు అవగాహన పెంచాల్సిఉంది. కాబట్టి,ప్రధానమంత్రిమోదీ దిశానిర్దేశం ప్రకారంమే29న 'వికసిత కృషి సంకల్ప్ అభియాన్'కుశ్రీకారం చుట్టిన వ్యవసాయరైతుసంక్షేమ మంత్రిత్వ శాఖ ఈకార్యక్రమాన్ని జూన్12 వరకూకొనసాగిస్తుంది.

ఈదేశవ్యాప్త ప్రచారంలో భాగంగా700 జిల్లాల్లోని65,000కుపైగాగ్రామాల్లో శాస్త్రవేత్తలతోకూడిన2,170 బృందాలుఇప్పటికే పర్యటిస్తున్నాయి. ఈబృందాల్లోని శాస్త్రవేత్తలు,నిపుణులుసుమారు1.5 కోట్లమంది రైతులను ప్రత్యక్షంగాకలుసుకుని,నిర్దిష్టఅంశాలపై అవగాహన కల్పిస్తారు.

ప్రధానమంత్రిశ్రీ నరేంద్ర మోదీ సమర్థనేతృత్వంలో వ్యవసాయం ఆధునికీకరణ,రైతులజీవితాల్లో ప్రగతిశీల మార్పుతేవడమే మా అగ్ర ప్రాథమ్యాలు. కాబట్టి,ఓమొక్కుబడి తంతుగా కాకుండారైతు జీవన సౌభాగ్యం లక్ష్యంగాఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నాం. భారతవ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్),వ్యవసాయవిజ్ఞాన కేంద్రాలు(కెవికె),రాష్ట్రవ్యవసాయ శాఖలు,వ్యవసాయవిశ్వవిద్యాలయాలు,ఆవిష్కరణసంబంధిత సంస్థల శాస్త్రవేత్తలుఈ బృందాల్లో సభ్యులుగా ఉంటారు. "వ్యవసాయవికాసంరైతుసౌభాగ్యం" లక్ష్యసాధన కృషిలోవీరంతా భాగస్వాములవుతారు. ప్రధానమంత్రినిర్దేశిత "ప్రయోగశాలనుంచి పొలానికి" మంత్రం ఈకార్యక్రమం ద్వారా సఫలమవుతుంది. రైతులభవిష్యత్తునే కాకుండా భారతవ్యవసాయ రంగం స్వరూపాన్నిఇది విప్లవాత్మకంగాతీర్చిదిద్దుతుంది.

ఈకార్యక్రమం కింద శాస్త్రవేత్తలుగ్రామాల్లోని రైతులతో నేరుగాసంభాషిస్తూ,తమపరిశోధన ఫలితాలను వారితోపంచుకుంటారు. అంతేకాకుండాతమ పరిశోధనలను మరింత సుసంపన్నం,ఆచరణాత్మకంగారూపుదిద్దుకునేలా రైతులఅనుభవసారం గ్రహిస్తారు. ఈకార్యక్రమం ద్వారా మన ప్రయత్నాలు,రైతులనిర్విరామ కృషి ఫలించి ప్రతిహెక్టారుకు కనీసం ఒక క్వింటాలువంతున దిగుబడి పెరిగినా,దేశవ్యాప్తంగా20 మిలియన్టన్నుల అదనపు ఆహారోత్పత్తిసాధ్యం కాగలదు.

దేశఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమేవెన్నెముక... జనాభాలోదాదాపు50 శాతంప్రత్యక్షంగా లేదా పరోక్షంగాఈ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. స్థూలదేశీయోత్పత్తి(జిడిపి)లోఈ రంగం వాటా దాదాపు18 శాతంగాఉంది. ఈనేపథ్యంలో ప్రధానమంత్రి మోదీనాయకత్వాన భారత్ అభివృద్ధిచెందిన దేశంగా రూపొందే మార్గంలోశరవేగంగా పరుగులు పెడుతోంది. ఈప్రగతి పయనంలో ఆధునిక వ్యవసాయం,సౌభాగ్యవంతులైనరైతులే కీలకపాత్ర పోషించాల్సిఉంటుంది.

రైతుకుసాధికారత కల్పన లక్ష్యంగా 'ఎన్‌డిఏ' ప్రభుత్వం గత11 ఏళ్లుగా 'విత్తనం నుంచి విపణి'దాకా అనేక నిర్ణయాలు తీసుకుంటూవ్యవసాయాన్ని సులభతరం చేసింది. కనీసమద్దతు ధరతో పంట కొనుగోళ్లతోపాటుఉల్లిపాయలు,బియ్యంపైఎగుమతి సుంకాల తొలగింపు,వాతావరణసమర్థ,అధికదిగుబడి వంగడాల రూపకల్పన,రైతుహితపథకాల విస్తరణ వంటి చర్యలుచేపట్టింది. రైతుసంక్షేమంపై మోదీ ప్రభుత్వనిబద్ధతకు ఇవన్నీ తిరుగులేనినిదర్శనాలు.

భారత్ఇటీవలే జపాన్‌ను వెనక్కునెట్టి,ప్రపంచంలో4వఅతిపెద్ద ఆర్థిక వ్యవస్థగాఅవతరించింది. వ్యవసాయఉత్పాదకత చారిత్రక వృద్ధిసాధించిన నేపథ్యంలో202425లోఆహార ధాన్యాల ఉత్పత్తి330.9 మిలియన్టన్నులకు చేరుకోగలదని అంచనా. ఖరీఫ్‌దిగుబడులలో ధాన్యం120.6 మిలియన్టన్నులు,గోధుమలు115.4 మిలియన్టన్నులు,సోయాబీన్15.1 మిలియన్టన్నులుగా రికార్డు



- శివరాజ్ సింగ్ చౌహాన్

స్థాయికిచేరగలవని అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగాసోయాబీన్ దిగుబడి హెక్టారుకు985 కిలోలనుంచి1,169 కిలోలకుపెరిగింది. మరోవైపు ఉద్యాన రంగంలోనూ దిగుబడులు362.1 మిలియన్టన్నులకు చేరుతాయని అంచనా. రైతులకృషి,శాస్త్ర పరిశోధనలు,రైతుహితప్రభుత్వ విధానాల సమష్టివిజయాన్ని ఈ అంచనాలు ప్రస్ఫుటంచేస్తున్నాయి.

దేశంలోనిరైతుల ఆదాయం పెంపు,వారిశ్రమకు తగిన విలువ నిర్ధారణసహా అన్నదాత స్వావలంబనకుకేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతోఉంది. తదనుగుణంగావిశాల దృక్పథం,సమగ్రవిధానం,సుస్పష్టవిధానాలు,లక్ష్యశుద్ధితోఆరు అంశాల వ్యూహం రూపొందించింది. ఉత్పాదకతపెంపు,ఖర్చులతగ్గింపు,గిట్టుబాటుధరకు భరోసా,విపత్తులలోతగిన చేయూత,పంటవైవిధ్యీకరణకు ప్రాధాన్యం,ప్రకృతివ్యవసాయానికి ప్రోత్సాహం ఈవ్యూహంలో భాగంగా ఉన్నాయి.

మొత్తంమీద 'వికసిత కృషి సంకల్ప్అభియాన్' రైతుల జీవనం మెరుగుదలకుఉద్దేశించిన ఒక మహా ఉద్యమం. రైతుసోదరీసోదరులందరూ ఇందులోభాగస్వాములై,ప్రయోజనంపొందాలన్నది నా విన్నపం. శాస్త్రవేత్తలసలహాలను పాటించడం ద్వారా మీవ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించుకుని,దిగుబడులను పెంచుకోవచ్చు. వ్యవసాయోత్పత్తిపెంపు,ఖర్చులతగ్గింపు,రైతుప్రయోజనాల ఇనుమడింపు ఈ కార్యక్రమలక్ష్యాలు. ఈమహా సంకల్పమే వికసిత భారత్‌కుపునాది అవుతుందనడంలో సందేహంలేదు!

**(రచయిత కేంద్ర ప్రభుత్వంలో వ్యవసాయ-రైతుసంక్షేమ, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి)**

# త్వరలోనే బాలికా రక్షక టీం

## మహిళల భద్రత కోసం పటిష్ట విధానాలు

### మేధో మధన ముగింపు సభలో మంత్రి సీతక్క ప్రకటన

**మహా :** మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మధన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మేధో మధన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మధన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు.

మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు. వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.


చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని .. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పాటై 10 సంవత్సరాలైనా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్‌ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటామని ప్రకటించారు.

బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవ



గాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారన్నారు. ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశారని తెలిపారు. అంగన్వాడీ సేవలకు ఆరాధ్యులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరా గాంధీ నిలిచారని చెప్పుకొచ్చారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. ఈ ఏడాది వేయి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్వాడీ గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని.. కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్వాడీ సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతీ శుక్రవారం అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను , హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు.

ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.




## ఎక్స్ చాట్ ప్రారంభించిన మస్క్

### వాట్సాప్ ఇన్ స్టా ఇక ఖతం?

**మహా:** ఎలన్ మస్క్ ట్రంప్ తో కలిసి అటు అమెరికాను అతలాకుతలం చేస్తూ ఇపుడు సోషల్ మీడియా పై పడ్డాడు. ప్రముఖ ఆన్‌లైన్ మెసేజింగ్ టూల్స్ అయిన వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్.. వంటి వాటికి పోటీగా ఎక్స్(గతంలో ట్విటర్) కొత్తగా 'ఎక్స్ చాట్'ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. ఇది తన వినియోగదారులకు అంతరాయం లేని, సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందిస్తుందని కంపెనీ సీఈఓ ఎలాన్‌మస్క్ తెలిపారు. ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్, డిసప్పియరింగ్ మెసేజెస్, ఆడియో/ వీడియో కాల్స్ వంటి అధునాతన సామర్థ్యాలను హైలైట్ చేస్తూ మస్క్ ఎక్స్ పోస్ట్‌లో ఈమేరకు ఎక్స్ చాట్ వివరాలు ప్రకటించారు. ఇన్‌స్టంట్ మెసేజింగ్ స్పేస్‌లో ఇప్పటికే దూసుకుపోతున్న కంపెనీలకు ఎక్స్ చాట్ పోటీదారుగా మారే అవకాశం ఉందని టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బీటా టెస్టింగ్‌లో ఉన్న ఈ అప్‌డేటెడ్ మెసేజింగ్ ఇంటర్ ఫేస్‌ను పరిమిత సంఖ్యలో యూజర్లకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. ఎక్స్ చాట్‌లో ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్, ఫైల్ షేరింగ్, వాయిస్, వీడియో కాల్స్ వంటి అధునాతన మెసేజింగ్ ఫీచర్లు ఉన్నాయని పేర్కొంది.

# సెక్రటేరియట్‌లో కళ్ళు తిరిగి పడిపోయిన మంత్రి కొండా సురేఖ

- వైద్య పరీక్షల అనంతరం నిలకడగానే మంత్రి సురేఖ ఆరోగ్యం
- లో బీపీ కారణంగా కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి

**మహా:** మంత్రి కొండా సురేఖ అస్వస్థతకు గురయ్యారు. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశానికి హాజరయ్యేందుకు కొండా సురేఖ సచివాలయానికి వచ్చారు. ఈ క్రమంలోనే మంత్రి కొండా సురేఖ సచివాలయంలో ఉన్న సమయంలో కళ్లు తిరిగి పడిపోయారు. దీంతో సచివాలయంలోని వైద్యుల బృందం వెంటనే మంత్రి కొండా సురేఖను పరిశీలించారు. లో బీపీ వల్ల ఆమె కళ్లు తిరిగిపడిపోయినట్టుగా వైద్యులు తెలిపారు. అయితే ఉదయం నుంచి ఆమె ఆహారం తీసుకోకపోవడంతో ఇలా జరిగినట్టు వైద్యులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు స్పష్టం చేశారు. సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రిని పరామర్శించారు. కొండా సురేఖను ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ప్లాస్టిక్‌రహిత స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం

## అందరం కలిసి మన పర్యావరణాన్ని రక్షించుకోవాలి

### ప్రపంచానికే సవాల్‌గా మహమ్మారిని నిర్మూలిద్దాం: మంత్రి కొండా సురేఖ

**మహా:** పర్యావరణాన్ని పరిరక్షించుకొని భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిపై ఉన్నాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికే సవాలుగా మారిన ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజల కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. మనం అందరం కలిసి మన పర్యావరణాన్ని రక్షించుకోవాలని, సంరక్షించుకోవాలనే బాధ్యతను ప్రపంచ పర్యావరణ దినోత్సం సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇదొక విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలు, యువత, పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలను ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాలలో భాగస్వామ్యం చేస్తున్నామని మంత్రి అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడే తరాన్ని తయారు చేస్తున్నామన్నారు. తెలంగాణలోని వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తుల నుంచి వచ్చే వ్యర్థాలను నిర్వహించే విస్తరిత ఉత్పాదక బాధ్యతను స్వీకరించాలని, ఆ మేరకు బాధ్యత తీసుకోవాలని అన్నారు. తెలంగాణలోని ప్రతి పౌరుడినీ, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, అలాగే రీసైక్లింగ్‌కు సహకరించాలని పర్యావరణ శాఖ మంత్రిగా కోరుతున్నట్టు చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చేసే అవగాహన



ప్రచారం, "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం"ను, ప్రారంభిస్తున్నందుకు తనకు గర్వంగా ఉందన్నారు. ఈ ప్రచారం మన రాష్ట్రంలో అవగాహనకు, చర్యలకు స్ఫూర్తినిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువతతో పాటు సమాజానికి కూడా ప్రత్యేక బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు, సామాజిక సంస్థలు, అందరూ కలిసి ఆదర్శవంతంగా పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి గూగులోత్, పిసిబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణ రెడ్డి, విజయలక్ష్మి, జయదేవ్, పిసిబి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లు రవిపై ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తాం

## .. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక ప్రకటన

**హైదరాబాద్, మహా :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. క్షమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి పై మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కు కంప్లైంట్ చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజేయుడితో కలిసి ఎంపీ తిరుగుతున్నాడని సంపత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా మల్లు రవిపై ఇచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. మల్లు రవిపై ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతంపై సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కేడర్‌కు సూచించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఎక్కడా ఇవ్వడం లేదని చెప్పారు. కులగణన విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.



మహా పత్రిక
ANN తెలుగు
శుక్రవారం, హైదరాబాద్
06-06-2025
WWW.MAHAADAILY.COM

# వీరు.. సంపన్న మహిళలు

HURUN INDIA

వీరు మేటి మహిళలు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళలు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్న మహారాణులు. 97 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాను హురున్ ఇండియా విడుదల చేసింది. శక్తిమంతమైన మహిళలతో 2025 కాండెరే హురున్ ఇండియా మహిళా నేతల లిస్ట్ తయారు చేసింది హురున్. ఇందులో అపర కుబేరుడు ముకేశ్ అంబానీ కుమార్తె ఈశా అంబానీ చోటు దక్కించుకున్నారు. ఫైనాన్షియల్, టెక్నాలజీ, దాతృత్వం, కళలు, స్టార్టప్ కంపెనీలకు సంబంధించిన మహిళలతో ఈ లిస్ట్ విడుదల చేశారు. ఇందులో బ్యాంకింగ్ నుంచి ఏకాంబర్, సాంకేతిక విభాగం నుంచి రాధా వెంబు, ఇన్ఫ్లూయెన్సర్ జాబితాలో మృణాల్ పంచాల్ ఉన్నారు. - మహా ప్రత్యేకం

మహా రాణి

## భారత్‌లో రిచెస్ట్ రిచెస్ట్ ఉమెన్ లిస్ట్

### శక్తివంతమైన మహిళల జాబితా విడుదల చేసిన హురున్ ఇండియా

### టాప్ 6లో ఈషా అంబానీ

| పేరు | సంపద(రూ. కోట్లల్లో) | వయసు | కంపెనీ |
|---|---|---|---|
| రాధా వెంబు | 55,300 | 52 | జోహో కార్పొరేషన్ |
| జయశ్రీ ఉల్లాల్ | 48,900 | 63 | అరిస్టా నెట్ |
| కిరణ్ మజుందార్ షా | 32,000 | 71 | బయోకాన్ |
| ఫాల్గుణి నాయర్ | 29,000 | 61 | నైకా |
| నేహా నర్ఖేడే | 6,800 | 41 | సంగమం |
| కవితా సుబ్రమణియన్ | 6,500 | 43 | అప్‌స్టాక్స్ |
| నేహా బన్సాల్ | 5,100 | 43 | లెన్స్‌కార్ట్ |
| ఇంద్ర కె నూయి | 4,800 | 69 | పెప్సికో |
| జూహీ చావ్లా | 4,600 | 57 | నైట్ రైడర్స్ |
| మీనా సేథీ | 2,700 | 80 | ఓరియంట్ ఫ్యాషన్ |

### శాంతి ఏకాంబరం ఫస్ట్

రూ.3.81 లక్షల కోట్లు విలువైన కోటక్ మహీంద్రా బ్యాంకు డిప్యూటీ ఎండీగా సేవలందిస్తున్న శాంతి ఏకాంబరం మహిళా వృత్తి నిపుణుల్లో అగ్రస్థానంలో నిలిచారు. రూ.1.44 లక్షల కోట్లు విలువ గల పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్, ఎండీగా ఉన్న పర్మీందర్ చోప్రా రెండో స్థానంలో నిలిచారు. ఇక రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న అంబానీ కూతురు ఈశా అంబానీ 6వ స్థానంలో నిలిచారు.

### మృచా బ్యూటీ మృణాల్

మరోవైపు.. స్టార్టప్ కంపెనీ మృచా బ్యూటీ వ్యవస్థాపకురాలు, ఇన్‌స్టా గ్రామ్‌లో 55 లక్షల మంది ఫాలోవర్లు గల మృణాల్ పంచాల్, ఇన్ ఫ్లూ యర్స్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఇక సంపద సృష్టిలో తొలితరం నేతగా జోహో కో ఫౌండర్ రాధా వెంబు చోటు దక్కించుకున్నారు. ఈమె వ్యక్తిగత సంపద విలువ రూ.55,300 కోట్లుగా అంచనాలున్నాయి. ఆ తర్వాతి స్థానంలో రూ.48,900 కోట్లతో అరిస్టా నెట్ వర్క్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయ శ్రీ ఉల్లాల్ నిలిచారు.

### రోష్ని నాడార్ బెస్ట్

ఇక భావితరం మహిళా నేతల విభాగంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్ పర్సన్ రోష్ని నాడార్ తొలి స్థానం ఆక్రమించారు. హెచ్‌సీఎల్ టెక్ ప్రస్తుతం 60 దేశాల్లో సేవలందిస్తోంది. రూ.1.11 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే ఈ సంస్థ వ్యవస్థాపకులు శివ్ నాడార్ 47 శాంతా వాటా షేర్లను రోష్ని నాడార్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీలో మెజారిటీ వాటాదారుగా, దేశంలో మూడో సంపన్న మహిళగా నిలిచారు.

### ముంబై నుండి అత్యధికం


ఇక ప్రాంతాల వారీగా చూసుకుంటే 38 మంది మహిళా నేతలు ముంబై నుంచే ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం గమనార్హం. ఆ తర్వాత ఢిల్లీ నుంచి 12 మంది, బెంగళూరు నుంచి 10 మంది ఉన్నారు. శక్తిమంతమైన మహిళల సగటు వయసు 51గా ఉంది. ఇక 25 శాతం మంది మహిళల వయసు 26 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండడం గమనార్హం. ఫైనాన్షియల్ సెక్టార్ నుంచి 23 మంది, వినియోగ ఉత్పత్తుల రంగంలో 18 మంది, ఆరోగ్య సంరక్షణ విభాగంలో 14 మంది చోటు దక్కించుకున్నారు.




### తొలితరం మహిళా పారిశ్రామిక వేత్తలు

## 2 లక్షల కోట్లు

తొలితరం మహిళా పారిశ్రామికవేత్తల సంపద దాదాపు రూ.2 లక్షల కోట్లకు చేరింది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్, రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో మొదటి నుంచి బిలియన్ డాలర్ల వ్యాపారాలను నిర్మించిన మహిళలు ఈ జాబితాలో చోటు సంపాదించారు.





# సేంద్రియ వ్యవసాయ పద్ధతి పాటించాలి

**రసాయనాల వినియోగం తగ్గించాలి**

**దండుమైలారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు**

**మండల వ్యవసాయ శాఖ అధికారి విద్యాధరి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రసాయనాల వినియోగం, సుస్థిర వ్యవసాయం సాగు నీటి యాజమాన్యం గురించి అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి విద్యాధరిని నిర్వహించడం జరిగింది. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, గండు మైలారం గ్రామంలో, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాయం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు డా. కె కవిత, ప్రధాన శాస్త్రవేత్త డా. ఎన్ జెమీమా పాల్గొని, రైతులకు పాడిపంటల గురించి సూచనలు ఇవ్వడం జరిగింది. పంట సాగులో యూరియా మరియు రసాయనాల వినియోగం తగ్గించాలని తెలిపారు. విత్తనం, రసాయనాల కొనుగోలు చేసేటప్పుడు రసీదులను భద్రపరచడం తప్పనిసరి అని రైతులకు ప్రత్యేకంగా సూచించారు. నేల సారం పెంచే విధానాలు, పంట మార్పిడి, చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ సంరక్షణ గురించి, సస్యరక్షణ అవశేషాల విభాగము గురించి వివరించడం జరిగింది. గ్రామ రైతులకు వరి, కూరగాయల సాగులోని సమాధానాలు తెలపడం జరిగింది.

వ్యవసాయ అధికారి విద్యాధరి మాట్లాడుతూ... సేంద్రియ వ్యవసాయ పద్దతి పాటించాలని సూచించారు. విస్తరణ అధికారి సృజన రైతులు తమ పంటలు నమోదు మరియు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో బిట్ల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎ సృజన, జేవీఓ పురుషోత్తం, మహాలక్ష్మి గ్రూప్ సీనియర్ అడ్వైజర్ రవి కాంత్, దండుమైలారం గ్రామ రైతులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సుల తీరును పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వార్డు కార్యాలయంలో తలపెట్టిన రెవెన్యూ సదస్సుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి. రెవెన్యూ సమస్యలను తమ గ్రామ పరిధిలో పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు భూ సమస్యల పరిష్కారం కోసం తమ గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు. భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులను సంప్రదించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్డీవో వెంకట రెడ్డి, ఎమ్మార్వో రవీందర్ దత్, ఆర్ ఐ కృష్ణ, సారిక, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## పశువుల రవాణాపై శంషాబాద్ డీసీపీ రాజేష్ తనిఖీ

- షాద్ నగర్ లో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ పరిశీలన
- ఫరూక్ నగర్ ఈద్గా, పోలీస్ స్టేషన్ ను సందర్శించిన అధికారి

**షాద్ నగర్, మహా:** బక్రీద్ పండుగకు సన్నాహకంగా జంతువుల రవాణా నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించడానికి శంషాబాద్ డిసిపి రాజేష్ మరియు షాద్‌నగర్ ఎసిపి ఎస్ లక్ష్మీనారాయణ రాయికల్ టోల్ ప్లాజా, చెక్‌పోస్ట్ పరిశీలించారు. అదేవిధంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణాలను తనిఖీ చేశారు. ఈ సందర్శనలో రిసెప్షన్, రికార్డులను సమీక్షించారు, సిబ్బంది, అధికారుల క్వార్టర్లను తనిఖీ చేశారు. మరియు దర్యాప్తు విధానాలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై పీఎస్ఐలకు సూచనలు అందించారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు జరుపుకునే ఫరూక్ నగర్ ఈద్గా వద్ద పరిసరాలను పరిశీలించారు. అధికారుల వెంట సిఐ విజయకుమార్ తదితరులు ఉన్నారు..

## ప్రభుత్వ పథకాలు పేదలకు పారదర్శకంగా అందిస్తాం

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు**



**రంగారెడ్డి ప్రతినిధి మహా:** రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఆవాసం కల్పిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఆదర్శనగర్ కాలనీలో మంజూరైన ఇందిరమ్మ వీళ్ళతో ఆవాసం కల్పించాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇండ్లకు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతోపాటు ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగేలా చూడటం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ బాబా, వెంకట్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జగన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, కృష్ణా నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అప్పం శీను, ఎంగలి ప్రసాద్, ఖాదర్, మాజీ వార్డు సభ్యులు సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం... మార్పుగా మారండి

- ఎక్కువ మొక్కలు నాటండి
- మన భవిష్యత్తు వర్ధిల్లేలా ప్రకృతిని పెంచుకుందాం
- కేశంపేట మండల మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** వృక్షో రక్షతి రక్షితః, ఇప్పుడు మనం వృక్షాలను పెంచి రక్షించుకుంటే భవిష్యత్తులో మన ముందు తరాలను వృక్షాలు రక్షిస్తాయని, మన భవిష్యత్తు వర్ధిల్లేలా ప్రకృతిని పెంచుకుందామని ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మార్పుగా మారండి ఎక్కువ మొక్కలు నాటండి, తక్కువ వ్యర్థాలు చేయండి మరియు మనకు జీవితాన్ని ఇచ్చే వృక్ష సంపదను రక్షించండని కేశంపేట్ మండల మాజీ జెడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె తన వంతుగా మొక్కలు నాటి అందరూ మొక్కలు నాటి భావితరాలకు మేలు చేయాలని కోరారు.

## గంజాయి కేసులో తాండూర్ ఎక్సైజ్ కానిస్టేబుల్

**తనిఖీల్లో పట్టుకున్న షాద్ నగర్ పోలీసులు**

**1.5 కిలోల గంజాయి పట్టివేత .. షాద్ నగర్ సిఐ విజయకుమార్ వెల్లడి**

**షాద్ నగర్,మహా:** షాద్ నగర్ లో పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకోగా అతని వద్ద కిలోన్నర గంజాయి లభించింది.. తీగ లాగితే డొంక కదిలినట్టు తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీజ్ అయిన గంజాయిని బయటికి తీసి ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ దీనిని తన బంధువు ద్వారా విక్రయించేతువు తీసుకు వెళుతుండగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంచలన సంఘటన వివరాలను షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్ గురువారం ఈ కేసుకు సంబంధించిన విషయాలు మీడియాకు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన పట్టణంలోని ఫరూక్ నగర్ యాదవ కాలనీ ఈద్గా వద్ద స్థానిక ఎస్సై దేవరాజ్ వాహనాల తనకి చేస్తుండగా అంజద్ (32) అనే యువకుడు చేతిలో కవర్ తీసుకొని అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు అతని వద్ద సోదా చేశారు. చేతి కవర్ లో గంజాయి వాసనను పసిగట్టి ఎస్సై దేవరాజ్ తదితర సిబ్బంది అతని అదుపులోకి తీసుకున్నారనీ సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూర్ ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గులాం సుల్తాన్ అహ్మద్ (52) సీజ్ చేసి ఉంచిన గంజాయిని బయటకు తీసి తన వరుసకు కుమారుడైన అంజద్ కు అమ్మాలని అందజేశాడనీ పోలీసులు పేర్కొన్నారు. ఈ గంజాయిని అమ్మే క్రమంలో అంజాత్ షాద్ నగర్ పోలీసులకు చిక్కినట్లు తెలిపారు. కంచె చేను మేసిన చందంగా తప్పుచేసి ఇరుక్కున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ గులాం సుల్తాన్ అహ్మద్, అంజద్ ఇరువురులను పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. 75 వేల విలువగల ఈ గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలని తన వరుసకు బాబాయి అయిన గులాం సుల్తాన్ అహ్మద్ తో కలిసి గంజాయి విక్రయాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ కేసును శంషాబాద్ డిసిపి రాజేష్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై దేవరాజును అభినందిస్తూ వారికి తగిన రివార్డు కోసం పై అధికారులకు సిఫార్సు చేయడం జరిగిందని సిఐ విజయకుమార్ తెలిపారు..





## చోరీల నియంత్రణకు కృషి చేయాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కృషి చేయాలని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆపరేషన్స్ క్రైమ్స్ విభాగం నూతన అదనపు డీసీపీగా బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్ గురువారం వరంగల్ సీపీని మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. బోనాల కిషన్ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేశారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత

**గ్రామాల్లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్.. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం**

**వరంగల్ మహా;** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంగెం మండలంలోని గవిచెర్ల గ్రామ పంచాయితీ కేంద్రంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

**రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు పరిష్కారం**

భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. బుధవారం వరంగల్ జిల్లా సంగెం మండలంలోని కాపులకనపర్తి , పల్లారుగూడెం గ్రామాలలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులకు గురువారం కలెక్టర్ సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి ద్వారా భూసమస్యలు పరిష్కారానికి రైతులకు సులభతరమైన విస్తృత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సదస్సులను జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ తెలిపారు. ఈ నెల 20 వరకు జిల్లాలో వర్ధన్నపేట మినహా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ధరఖాస్తు కోసం వచ్చే వారికి కేంద్రంలో ఏర్పాట్లు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించాలని ఆన్నారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజ్ కుమార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలి

**హన్మకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

**హన్మకొండ మహా;** ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం లబ్ధిదారులకు అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలోని 17 వ నెంబర్ రేషన్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ రేషన్ దుకాణానికి ఎన్ని క్వింటాల బియ్యం వచ్చింది, ఎంత పంపిణీ చేశారు,ఏ ఏ సమయాల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు, కొత్త రేషన్ కార్డులు ఎన్ని వచ్చాయి, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పుల కార్డులు ఉన్నాయా అని డీలర్ కందుకూరి కమల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాప్ కు వచ్చిన బియ్యం బస్తాలను పరిశీలించారు. రేషన్ బియ్యం తీసుకునేందుకు అక్కడికి వచ్చిన కార్డుదారులతో నేరుగా కలెక్టర్ మాట్లాడారు. గత నెలలో వచ్చిన సన్న బియ్యన్ని తీసుకున్నారా, ఎన్ని కిలోలు తీసుకున్నారు, సన్న బియ్యం ఎలా ఉన్నాయని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా అందజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొమరయ్య, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, నాయబ్ తహసిల్దార్ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.






## పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

**బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**వరంగల్ మహా ;** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5 గురువారం పురస్కరించుకొని బల్దియా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా బృందాలకు (ఎస్ హెచ్ జీ)మొక్కలు నాటడం పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ప్రారంభించి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్ హెచ్ జీ బృందాలు ఇట్టి శిక్షణను సమర్థవంతం గా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ వో లు రమేష్, లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ అనూహ, సి ఓ లు శ్రీలత, సుజాత, మెప్మా ఆర్ పి లు, తదితరులు, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ అధికారులు**



**హన్మకొండ మహా;** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో కలెక్టర్ అధికారులతో కలిసి వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో విద్యాలత,జిల్లా అధికారులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ కుమార్, లక్ష్మీ రమాకాంత్, చంద్రశేఖర్, రవీందర్ సింగ్, కలెక్టరేట్ పాలనాధికారి గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి**

**హన్మకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం స్థానికులు దరఖాస్తు చేస్తుండగా రెవెన్యూ అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, ఆన్లైన్ చేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సు సందర్భంగా అర్జీల స్వీకరణకు ఏర్పాటు చేసిన వివిధ సహాయక కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల గురించి అధికారులు సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ సదానందం, నాయబ్ తహసిల్దార్ సంతోష్ కుమార్, ఎంపీడీవో అనిల్ కుమార్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సయ్యద్ నగర్ లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**

ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి పరిధిలోని సయ్యద్ నగర్ లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా వాటిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాలకు ఇప్పటివరకు ఎంత ఖర్చయిందని, నిర్మాణ సామగ్రిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారని, ఎప్పటిలోగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకుంటారని లబ్ధిదారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల పురోగతి, బిల్లుల చెల్లింపు తదితర వివరాలను స్థానిక పంచాయతీ కార్యదర్శి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్, ధర్మసాగర్ ఎంపీడీవో అనిల్ కుమార్, ఇతర అధికారులతో పాటు ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ కోసం ర్యాలీ...




ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్వదేశీ జాగరన్ మంచ్ , వాకర్స్ ఆధ్వర్యంలో గురువారం రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్లో పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా వచ్చే వివిధ రకాల వ్యాధులు మానవ మనగడకే ప్రమాదకరమని, అలాగే చెట్లను నాటిపచ్చదనాన్ని పెంపొందించుకుంటే పర్యావరణాన్ని కాపాడవచ్చని వారు ఈ సందర్భంగా తెలిపారు .. ఈ సందర్భంగా స్టేడియం లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్రకన్వీనర్ సిఏ హరీష్‌బాబు , వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుడిపాటి రమణారెడ్డి, అన్నమనేని సుధాకర్ రావు ,డాక్టర్ అమర్నాథ్ పెంచాల కిషన్ రావు, హార్ట్ ఫీట్ వాకర అసోసియేషన్ ప్రవీణ్ ,యోగా కోచ్ కిష్టయ్య, శ్రీరామ మహర్షి ,యోగ గురువు కుమార్ మహర్షి , పెద్ద సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు.

# అవినీతికి తావు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

## 90శాతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

- పార్టీ పరిశీలకుల నిర్ణయం మేరకే పదవులు
- పరిశీలకులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి
- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**జనగామ మహా;** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా మనందరం సమిష్టిగా కలిసి పని చేద్దామని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. జఫర్ గడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జఫర్ గడ్ మండల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను, మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా మంజూరు అయిన 4కోట్ల 86లక్షల 40వేల రూపాయల రుణాలను మహిళా సంఘాలకు అందజేశారు. అనంతరం జఫర్ గడ్ మండల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పిసిసి పరిశీలకులు లింగం యాదవ్ గారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఆలోచన అంతా నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉండాలని, మన సంకల్పానికి ఏదీ అడ్డు కాకూడదని వెల్లడించారు. ఎంత కలుపుకుపోవాలని చూసినా ఇంకా కొంత అభిప్రాయ బేధాలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. నియోజకవర్గంలో మన బలం పెరిగిందని, చిన్న చిన్న కారణాలతో బలహీనం చేసుకోవద్దని కోరారు. అందరం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని పాత, కొత్త అనే విషయాన్నీ మర్చిపోవాలని సూచించారు. నాకు, పార్టీకి కావాల్సింది సమర్థవంతమైన నాయకత్వమని స్పష్టం చేశారు. ఏఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు పని చేసే వారు కావాలని తెలిపారు. నియోజకవర్గంలో భిన్న నాయకత్వాలకు చోటు లేదని, అలాంటి అవసరం కూడా లేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 90శాతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, ఎక్కడా అవినీతి లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ఇందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలలో అందరి సమన్వయం చేసుకొని సమిష్టి నిర్ణయంతో లబ్ధిదారుల ఎంపిక జరగాలని అన్నారు. వచ్చే మూడు ఏళ్లలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తాయని హామీ ఇచ్చారు. ఎక్కడా, ఎవరికీ లంచం ఇవ్వొద్దని సూచించారు. పార్టీ పరిశీలకుల నిర్ణయం మేరకే పదవులు ఉంటాయని, ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారికీ అవకాశాలు వస్తాయని అన్నారు. అందుకు ప్రతీ ఒక్కరూ పార్టీ పరిశీలకులకు సహకరించాలని కోరారు. నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేసే వారిని గ్రామ, మండల స్థాయిలో రాజకీయంగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. మనందరం కలిసి నియోజకవర్గంలో, మండలంలో, గ్రామంలో పార్టీని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, ఎంపిడివో, ఇతర అధికారులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## తాళ్లపల్లిగూడలో భూభారతి అవగాహన సదస్సు

- రైతుల పాలిట వరం భూభారతి
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** భూ రికార్డులో తప్పులను సరిదిద్దడానికి రైతులకు మెరుగైన సేవలను అందించడానికి భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం, తాళ్లపల్లిగూడలో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... భూభారతి పోర్టల్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయ భూముల నిర్వహణ కోసం, భువివాదాలు లేని తెలంగాణనే లక్ష్యంగా ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రారంభించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంత రెడ్డి, ఎమ్మార్వో ప్రసాదరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, ఈసి శేఖర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వీఆర్ వన్ వెంకటేశ్వర రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, మంతని శివ యాదవ్, అమ్మనబోలు భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతవరణంలో బక్రీద్ పండుగను జరుపుకుందాం

## సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మొద్దు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతియుత వాతవరణంలో బక్రీద్ పండుగను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో గురువారం శాంతి (పీస్) కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ట్రై సిటి పరిధిలోని వివిధ మతాలకు చెందిన మత పెద్దలతో పాటు, ప్రభుత్వ అధికారులు పాల్గోన్న ఈ సమావేశంలో ముందుగా వివిధ మతాలకు చెందిన మత పెద్దలు మాట్లాడుతూ వరంగల్ నగరంలో అన్ని మతాల వారు ఐక్యమత్యంతో ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకుంటామని, పండుగల సందర్బంగా ఎలాంటి సమస్యలు రాకుండా పోలీసులకు పూర్తి సహయ సహకారాన్ని అందిస్తామని తెలియజేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్బంగా ప్రభుత్వ పరంగా పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ముఖ్యంగా పోలీస్ బందోబస్తు నిర్వహణకు తీసుకోవాల్సిన కార్యచరణ ప్రణాళికను పోలీస్ అధికారులతో చర్చిండం జరిగిందని. ప్రతి ఏడాది జరిగినట్టే ఈ ఏడాది కూడా ప్రశాంతంగా బక్రీద్ జరుగుకుందాం, కాని ప్రధానంగా ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మద్దొని, ఇలాంటి వదంతులు మీ దృష్టికి వస్తే పోలీసులను సంప్రదించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో ఎవరైన సోషల్ మీడియా వదంతులు ప్రచారం చేస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎవరైన చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడ తున్నట్లుగా సమాచారం వుంటే పోలీసులకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గతంలో ప్రజల నుండి పిర్యాదుల అధారంగా ఏడాది అలాంటి సమస్యలు రాకుండా ముందస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోబడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ మట్లాడూతూ పండుగ వేళ జంతు వ్యర్థాలను తరలించేందుకు ఉదయం నుంచే ఎక్కువ సంఖ్యలో మున్సిపల్ వాహనాలను వినియోగించడం జరుగుతుందని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏసిపిలు జితేందర్ రెడ్డి, నర్సింహా రావు,నందిరాం నాయక్, ప్రశాంత్ రెడ్డి, కాజీపేట దర్గా పీఠాధిపతి, తెలంగాణ హజ్ కమీటీ చైర్మెన్ ఖుస్రూపాషా, తెలంగాణ ఆర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మతో పాటు, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరక్టర్,ఇన్స్పెక్టర్లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గోన్నారు.



## విద్యార్థులూ.. కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

- ఫోన్ కు దూరంగా పుస్తకాలకు దగ్గర ఉండాలి
- చదువు , క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు..
- కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మహా:** ఆధునిక కాలంలో కంప్యూటర్ వినియోగం అత్యవసరమైందని.. విద్యార్థులు కంప్యూటర్ పై పట్టు పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ లోని చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఫోటోషాప్ పై నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతులు ముగిశాయి. గురువారం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఫోన్ కు దూరం ఉండి పుస్తకాలకు దగ్గర ఉండాలని విద్యార్థులకు సూచించారు. చదువు, క్రమశిక్షణను నమ్ముకుంటే ఉన్నత స్థానాలకు ఎదుగుతామని.. దీంతో సమాజంలో గౌరవం వస్తుందన్నారు. ప్రతిరోజు కంప్యూటర్ పై ప్రాక్టీస్ చేయాలన్నారు. హోంవర్క్ గా ఒక పేజీ టైప్ చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇది భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు కూడా కంప్యూటర్ పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా నియంత్రణ అధికారి అశోక్ రెడ్డి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ వెంకట రాంబాబు, ప్రోగ్రాం ట్రైనర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి పర్యావరణంపై బాధ్యత ఉండాలి

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే పర్యావరణ రక్షించాలి



**రంగారెడ్డి జిల్లా మహా:** పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుతూ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని, ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయంగా కమిషనర్ రవీందర్ సాగర్ మొక్కను నాటి ఒక మంచి ఉదాహరణగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి పర్యావరణంపై బాధ్యత ఉండాలని అన్నారు. ఒక్కొక్కరు ఒకొక్క మొక్క నాటి పర్యావరణానికి మేలు చేసిన వాళ్ల అవుతారని ఆయన అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో దుకాణ సముదాయాలలో ప్లాస్టిక్ బ్యాగులను వాడకుండా, ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ప్రపంచ పర్యావరణ సందర్భంగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ అధికారి ప్రణవ్ గౌడ్, ఇతర మున్సిపల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ముందడుగు

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన సామాజిక బాధ్యత
- జిఎంజీ ఫౌండేషన్ చైర్మన్ గుండ్ల జంగం గౌడ్

**రంగారెడ్డి జిల్లా మహా:** పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుతూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న జి ఎం జీ ఫౌండేషన్ చైర్మన్ గుండ్ల జంగం గౌడ్ గురువారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పోల్కంపల్లి గ్రామంలో స్వయంగా మొక్కను నాటి, దానికి నీరు పోయడం ద్వారా ఒక మంచి ఉదాహరణగా నిలిచారు. చెట్లే మానవాళికి జీవనాధారమని విశ్వసించే గుండ్ల జంగం గౌడ్ గత కొన్ని సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం నిబద్ధతతో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..."ప్రతి ఒక్కరికి పర్యావరణంపై బాధ్యత ఉండాలని అన్నారు. మన ప్రాణవాయువు మూలం చెట్లు, ఒక్కొక్కరు ఒకొక్క మొక్క నాటి దానికి నీళ్ళు పోస్తే, రేపటి తరాలకు తాగడానికి నీరు, ఊపిరి పీల్చడానికి గాలి లభ్యమవుతుంది." అని తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామస్థుల చేత అభినందనలు పొందింది. చిన్న చర్యలే పెద్ద మార్పులకు నాంది వేశే దిశగా సాగిపోతున్నాయని పలువురు వ్యాఖ్యానించారు. జిఎంజీ ఫౌండేషన్ చేపడుతున్న పర్యావరణ, విద్య, ఆరోగ్య కార్యక్రమాలు ఇప్పటికే అనేక గ్రామాల్లో ప్రభావాన్ని చూపిస్తున్నాయి. జి ఎం జీ చైర్మన్ చేపట్టిన ఈ కార్యాచరణ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా దోహదపడనుంది.

# డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## మొక్కలు నాటిన ప్రిన్సిపాల్ అధ్యాపకులు

### ప్రతి ఒక్కరు తమ వంతు కర్తవ్యంగా మొక్కలు నాటాలి




**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో జాతీయ సేవ పథకము (ఎన్ఎస్ఎస్) మరియు వృక్ష శాస్త్రాల విభాగము ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తో కలిసి అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ... మొత్తం భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి కానీ మన దేశంలో కేవలం 22 శాతం మాత్రమే ఉన్నాయి. తెలంగాణలో 21 శాతం మాత్రమే ఉన్నాయి. అడవులు తక్కువవడం వలన అనవృష్టి అతివృష్టి మరియు భూగోళం వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్) లాంటి సమస్యలు ఏర్పడతాయని, తద్వారా ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. అందువలన ప్రతి ఒక్కరు తమ వంతు కర్తవ్యంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ రచన అధ్యాపకులు డి.వి. రావు, జీ. రవికుమార్, డాక్టర్ సురేఖ డాక్టర్ ఎన్. సురేష్ డాక్టర్ టి కృష్ణ, డాక్టర్ డి ఎస్ ఎస్ ఆర్ కృష్ణ, డాక్టర్ నర్సింగ్ రావు, డాక్టర్ శంకర్, డాక్టర్ నీలిమ మరి అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరంతర దశాబ్దాల పోరాటాల ఫలితమే జీవో 89

## మరిన్ని న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలి

### మంత్రి సీతక్కకు ముత్తినేని వీరయ్యకు కృతజ్ఞతలు

### ఎన్పీఆర్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డి) దశాబ్దకాలంగా సాగించిన నిరంతర ఉద్యమాల ఫలితంగా తాజాగా ప్రభుత్వం జీవో 89ను విడుదల చేయడం హర్షనీయమని ఎన్పీఆర్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి డి.సీతక్కకు, జీవో సాధనలో ప్రధాన పాత్ర పోషించిన టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. భుజంగారెడ్డి మాట్లాడుతూ... 40 శాతం వైకల్యం కలిగినవారికి చదువుతో సంబంధం లేకుండా సహాయ పరికరాలు అందించాలని కేంద్ర ఆర్ పిడబ్ల్యుడి చట్టం 2016లోనే పేర్కొనినప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో అమలు కాకపోవడంతో లక్షలాది మంది వికలాంగులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. ఎన్పీఆర్డి 2014 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగించిందని, ముఖ్యంగా 2024 డిసెంబర్ 9న హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా, మే13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించాయని తెలిపారు. జీవో 89తో తొమ్మిది రకాల సహాయ పరికరాలను 40 శాతం వైకల్యం ఉన్న వారికి అందించనుండటం శుభపరిణామమని చెప్పారు. అయితే ఆదాయ పరిమితి అడ్డంకిగా లేకుండా ప్రతి అర్హుడికీ పరికరాలు అందేలా జీవోలో మార్పులు చేయాలని కోరారు. అలాగే వికలాంగుల పింఛన్‌ను రూ.6,000కి పెంచాలని డిమాండ్ చేశారు.



# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతి

## గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు

- రైతులతో ముఖాముఖి సమస్యల పరిష్కారానికి కృషి
- రైతులకు భూములపై పూర్తి హక్కులు భూభారతి చట్టంతో
- రెవెన్యూ సదస్సులోని అర్జీలు ఆగస్టు 14 లోపు పూర్తి
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన నూతన ఆర్ఓఆర్ భూభారతి చట్టం2025 అమలులో భాగంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త ఆర్. ఓ. ఆర్ 2025 చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14వ తేదీ లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలో అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు రైతులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్ నగర్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## కోటి మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన

### రాణి రుద్రమ దేవి మహిళ భవన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని..




**హన్మకొండ మహా;** మహిళా సాధికారత కోసం సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. గురువారం రోజున 61 వ డివిజన్ పరిధిలోని సిద్ధార్థ నగర్ లో రూ.22.60 లక్షలతో నిర్మించిన రాణి రుద్రమ దేవి మహిళా భవన్ ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో అనతికాలంలోనే మహిళా భవనాన్ని నిర్మించి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి కాలనీలో కూడా అభివృద్ధి పై ప్రతినిధులకు కాలనీ వాసులు సహకరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రతి కాలనీలలో కాలనీ అభివృద్ధి కమిటీలు అవసరమని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. గతంలో 50 లక్షలు పై చిలుకు నిధులు రాని 61 వ డివిజన్ కి దాదాపు 3 కోట్ల పై నిధులు కేటాయించి సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ నిర్మాణాలు చేపట్టామని గుర్తు చేశారు. అర్థవంతంగా నిలిచిపోయిన కాజీపేట బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకు వెళ్లి 14 కోట్ల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని గతంలో జరిగిన అభివృద్ధి గడిచిన 16 నెలలుగా జరిగిన అభివృద్ధి పనులపై తేడా గమనించాలని సూచించారు. డివిజన్ లలో సిబ్బంది కొరత ఉందని స్థానికులు కోరగా ఇటీవలే కౌన్సిల్ లో తీర్మానం చేసిపంపామని రానున్న వర్షాకాలం నాటికి సరిపడా సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. తమ కాలనీలో అభివృద్ధి కోసం కృషి చేసిన సందర్భంగా కాలనీ పెద్దలు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

# గునుగల్ లో పర్యావరణం పచ్చదనం

**రంగారెడ్డి జిల్లా మహా:** యాచారం మండలం గునుగల్ గ్రామంలో పర్యావరణం దినోత్సవం సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాల్గొనడం జరిగింది. యాచారం మండలం గుణుగల్ గ్రామంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పరిసరాలు పరిశుభ్రంగా చేయడం జరిగింది అనంతరం యాచారం మండలం మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ గుణగల్ గ్రామంలో మొక్కలు నాటడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణంలో పంట పొలాల వద్ద విస్తృతంగా మొక్కలు నాటాలని ప్రజలకు సూచించారు పచ్చదనంతో పర్యావరణం పచ్చదనంతో ఉంటుందని, వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభా రాణి, మాజీ వైస్ ఎంపీపీలు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మచ్చ లక్ష్మణ్, కన్నారెడ్డి, గిరమోని రవీందర్, ప్రభాకర్, రాకేష్,మహేష్,రాజు, మధుసూదన్, సురేష్, నరేశ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొనారు.

# ఆడుతూ.. పాడుతూ.. డబ్బు పాఠాలు

**పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత నేర్పించడం చాలా ముఖ్యం. ఈ వేసవి సేలవుల్లో తల్లిదండ్రులు విభిన్న వయసు కలిగిన పిల్లలు, యువతకు వైవిధ్యంగా, ఆకర్షణీయంగా డబ్బుకు సంబంధించిన అంశాలను తెలియజేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల్లో మనీ మేనేజ్‌మెంట్ విషయాలపై బలమైన పునాది నిర్మిస్తే పొదుపు, దీర్ఘకాలంలో సమకూరే ప్రయోజనాలపై స్పష్టత ఏర్పడుతుంది. వయసు వారీగా పిల్లలకు ఎలా డబ్బు అంశాలు తెలియజేయాలో చూసేద్దాం.**



### వయసు 3–5 ఏళ్లు

నాణేలు, కరెన్సీని గుర్తించడంపై అవగాహన కల్పించాలి. డబ్బు ద్వారా వస్తువులను కొనుగోలు చేయవచ్చని అర్థం చేయించేలా అవసరాలు, ఆ అవసరాల మధ్య తేడాను గుర్తించేలా చెప్పేందుకు ప్రయత్నించాలి. కథలు చెప్పడం, ఆడించడం లేదా నాటకం రూపంలో దుకాణంలో వస్తువులను కొనుగోలు చేయడం, డబ్బు ఇవ్వడం, తీసుకోవడం.. వంటి వాటిని తెలియజేయాలి.

### వయసు 6–13

పొదుపు చేయడం, ఖర్చు చేయడం, ఈ రెండింటి మధ్య తేడాలు, ఖర్చు అధికమైతే కలిగే నష్టాలను చెప్పాలి. బేసిక్ బడ్జెటింగ్ సూత్రాలు చెప్పాలి. పిల్లలు ఏదైనా వస్తువు కొనాలంటే డబ్బు ఎలా వస్తుందో చెబుతూ.. ఇంట్లో చిన్నచిన్న పనులు చేయమని చెప్పాలి. అందుకు కొంత మొత్తంలో డబ్బు ఇవ్వండి. దాంతో రెండు ప్రయోజనాలుంటాయి. డబ్బు సంపాదించేందుకు ఎంత కష్టపడాలో తెలుస్తుంది. దాన్ని ఎలా ఖర్చు చేయాలో ఆలోచిస్తారు. అనవసర వస్తువులకు డబ్బు ఖర్చు చేసిన తర్వాత ఏదైనా అత్యవసర సమయాల్లో మనీ కావాలంటే మళ్లీ కష్టపడాల్సి వస్తుందనే భావనను తెలియజేయాలి. పొదుపుపై అవగాహన పెంచాలి. డబ్బును కిడ్డీ బ్యాంకులో జమ చేయడం అలవాటు చేయాలి.

### టీనేజ్ (14+)

క్రెడిట్, వడ్డీ, పెట్టుబడి, పన్నుల గురించి చర్చించాలి. బ్యాంక్ స్టేట్‌మెంట్ చదవడం లేదా యాప్‌లు, స్ప్రెడ్ షీట్‌లను ఉపయోగించి ఖర్చులను ట్రాక్ చేయడం ఎలాగో నేర్పించాలి.

### షాపింగ్ వెళ్తున్నారా..

వేసవి సెలవులు ఇంకొన్ని రోజుల్లో ముగుస్తాయి. పుస్తకాలు, బట్టలు ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు పిల్లలు తల్లిదండ్రులతో షాపింగ్‌మాళ్లకు వెళ్తుంటారు. దుకాణాల వద్ద ధరలను గమనించాలి. డిస్కౌంట్లను చర్చించాలి. బ్రాండ్లలో ఉండే తేడాలు పరిశీలించాలి. లోకల్ షాపులోనూ అదే తరహా వస్తువులు లభిస్తాయి. కానీ రెండింటి మధ్య తేడాలేమిటో అడిగి తెలుసుకోవాలి. ఇతర దేశాల వస్తువులపై ఏమేరకు పన్నులు విధిస్తున్నారో తెలుసుకోవాలి. ఆ పన్నుల వల్ల కంపెనీలు, వినియోగదారులపై కలిగే ప్రభావాలను గమనించాలి. పిల్లలు బడ్జెట్ తయారు చేసుకోవాలి. బడ్జెట్ సమయంలో 503020 నియమాన్ని పాటించాలి. అంటే నిత్యం అవసరాల కోసం చేసే తప్పనిసరి ఖర్చుకు మొత్త రాబడిలో 50 శాతం, కోరికల కోసం 30 శాతం, పొదుపునకు మరో 20 శాతం కేటాయించాలి. కుటుంబ బడ్జెట్ రాసేప్పుడు పిల్లలను కూడా అందులో భాగస్వామ్యం కావాలి.

## సర్క్యులర్ మోడల్ అనుసరిస్తున్న తొలి స్పోర్ట్స్ రిటైలర్




డెకాథ్లాన్ ఇండియా తన ప్రధాన వ్యాపార నమూనాలో సర్క్యులర్ బిజినెస్ మోడల్‌ను అనుసరిస్తున్నట్లు తెలిపింది. భారతదేశంలోనే ఈ చొరవ చూపిన మొదటి స్పోర్ట్స్ రిటైలర్‌గా నిలిచినట్లు పేర్కొంది. ఈ 'మిషన్ ఎల్ఐఎఫ్ఈ (లైఫ్స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)' స్థిరమైన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వ్యర్థాలను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు చెప్పారు.

సర్క్యులర్ బిజినెస్ మోడల్‌లోని అంశాలు..

**రిపేర్ సర్వీసులు:**
95+ స్టోర్లలో రిపేర్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఇది వినియోగదారులు వారి స్పోర్ట్స్ వస్తువులకు మరింత సర్వీసు వెసులుబాటును పొందవచ్చు.

**సెకండ్ లైఫ్ రీసేల్:**
పునరుద్ధరించిన ఉత్పత్తులు 90+ స్టోర్లలో తిరిగి విక్రయించనున్నారు. ఇది క్రీడా పరికరాలను మరింత చౌకగా చేస్తుంది.

**బైబ్యాక్ ప్రోగ్రామ్:**
ఉపయోగించిన పరికరాలను 50+ స్టోర్లలో తిరిగి ఇవ్వవచ్చు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఈ సేవలు ఉపయోగించుకోవచ్చు.

**సుస్థిరత లక్ష్యాలు**
డెకాథ్లాన్ 2024 స్థాయితో పోలిస్తే 2027 నాటికి సర్క్యులర్ బిజినెస్ టర్నోవర్‌లో 200% వృద్ధిని అంచనా వేస్తుంది. 2027 నాటికి 3,00,000 కంటే ఎక్కువ క్రీడా ఉత్పత్తులను పునరుద్ధరించాలని భావిస్తుంది. డెకాథ్లాన్ గ్లోబల్ డీకార్బనైజేషన్ వ్యూహంలో భాగంగా 2050 నాటికి నికరసున్నా ఉద్గారాలను, 2030 నాటికి కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను 42% తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే అధిక నాణ్యత, దీర్ఘకాలిక ఉత్పత్తులను సరసమైనవిగా మార్చడం లక్ష్యమని డెకాథ్లాన్ ఇండియా సీఈఓ శంకర్ ఛటర్జీ నొక్కి చెప్పారు.


## ఈ-ఆధార్‌తో తత్కాల్ టికెట్ల బుకింగ్..



తత్కాల్ రైలు టికెట్ల బుకింగ్ కోసం భారతీయ రైల్వే తప్పనిసరి ఈఆధార్ ధ్రువీకరణను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నెలాఖరులో కొత్త విధానం అమల్లోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి. తత్కాల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టడం, ఈ కోటా కింద నిజమైన ప్రయాణికులకు రైలు టికెట్లను అందించడమే ఈ చర్యల లక్ష్యమని రైల్వేశాఖ తెలిపింది. రైలు టికెట్ బుకింగ్‌లను ఈఆధార్ వెరిఫికేషన్‌తో అనుసంధానం చేయడం ద్వారా మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా టికెటింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. చివరి నిమిషంలో ప్రయాణ ప్రణాళికల కోసం ఉద్దేశించిన తత్కాల్ టికెట్లను కొందరు ఏజెంట్లు అన్యాయమైన మార్గాలను ఉపయోగించి హోర్డింగ్, ఆటోమేటెడ్ బుకింగ్‌లకు తెరతీస్తున్నారని వాదనలున్నాయి. కొత్త ఈఆధార్ ధృవీకరణ ద్వారా ప్రయాణీకులు బుకింగ్ సమయంలో వారి గుర్తింపును డిజిటల్‌గా ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇది మోసపూరిత బుకింగ్‌లను అరికట్టడానికి, ప్రక్రియను మరింత మెరుగుపరిచేందుకు భారతీయ రైల్వేకు తోడ్పడుతుంది. 'తత్కాల్ టికెట్లను బుక్ చేయడానికి భారతీయ రైల్వే త్వరలో ఈఆధార్ ధ్రువీకరణను ఉపయోగిస్తుంది. ఇది నిజమైన వినియోగదారులు అత్యవసర సమయంలో టికెట్లను పొందడానికి సహాయపడుతుంది' అని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. సాధారణంగా ప్రయాణికులు సీట్ల లభ్యతను బట్టి 60 రోజుల ముందుగానే రైలు టికెట్లను బుక్ చేసుకోవచ్చు. తర్వాతి రోజు బయలుదేరే రైలు టికెట్ బుకింగ్ కోసం ఏసీ క్లాసులు (1ఎ, 2ఎ, 3ఎ, సిసి, ఇసి, 3ఇ)కు ఈరోజు ఉదయం 10:00 గంటలకు బుకింగ్ ప్రారంభమవుతుంది. నాన్‌ఏసీ తరగతుల (ఎస్ఎల్, ఎఫ్‌సీ, 2ఎస్) టికెట్ బుకింగ్ కోసం ఉదయం 11:00 గంటలకు బుకింగ్ ప్రారంభమవుతుంది. బుకింగ్‌లను అనుమతించే తత్కాల్ పథకం ద్వారా 20% టికెట్లు విక్రయిస్తారు.

# క్రీడా వార్తలు SPORTS NEWS

## తొక్కిసలాటపై పెల్లుబికిన ప్రజాగ్రహం..
### ఐపీఎల్ ఛాంపియన్ ఆర్సీబీపై కేసు..!



ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(RCB)కు బిగ్ షాక్. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్ గెలుపొందిన ఆ జట్టు సంబురాల వేడుక విషాదాంతం కావడంతో ప్రజాగ్రహం పెల్లబికింది. దాంతో, పోలీసులు ఆర్సీబీ ఫ్రాంచైజీపై కేసు నమోదు చేశారు. చిన్నస్వామి స్టేడియం సమీపంలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతికి పరోక్షంగా ఆర్సీబీ యాజమాన్యం కూడా కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు పోలీసులు. యావత్ భారత దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన చిన్నస్వామి తొక్కిసలాటపై కర్నాటక ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. పదకొండు మంది మరణానికి కారణమైన ఈ ఘటనపై విచారణ బాధ్యతలను జిల్లా మేజిస్ట్రేట్ జి.జగదీశకు అప్పగించింది. తొక్కసలాటపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన మేజిస్ట్రేట్ గురువారం ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం(KCA), ఈవెంట్ ఆర్గనైజేషన్ డీఎన్ఏ ఎంటైర్‌టైన్‌మెంట్‌కు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అయితే.. బెంగళూరు పోలీసులు తొక్కిసలాట ఘటనను సుమోటోగా స్వీకరించి ఆర్సీబీ యాజమాన్యంపై, కేసీఏపై కేసు పెట్టారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 105తో పాటు మరో ఐదు సెక్షన్ల కింద ఆర్సీబీ, కేసీఏ, ఈవెంట్ సంస్థపై కేసు పెట్టారు పోలీసులు.

**అసలేం జరిగిందంటే..**
ఐపీఎల్ ఆరంభం నుంచి కప్ కోసం నిరీక్షిస్తున్న ఆర్సీబీ ఎట్టకేలకు 18వ సీజన్లో ఛాంపియన్‌గా అవతరించింది. తమ అభిమాన జట్టు ట్రోఫీతో స్వరాష్ట్రానికి రావడంతో విక్టరీ పరేడ్ కోసం కన్నడ ప్రజలు భారీగా చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తారు. బుధవారం మైదానంలో కర్నాటకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్సీబీ ఆటగాళ్లను సన్మానించారు. అనతంరం విక్టరీ పరేడ్ ఉంటుందని తెలిసి.. భారీగా అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. మైదానం సామర్థ్యం 35 వేలు కాగా.. బయట దాదాపు 3 లక్షల మంది పోగయ్యారు. ఒక్కసారిగా గేట్లు తెరవడంతో అందరూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. అయితే.. కొందరు భారీ కేడ్లను దూకుతూ చొచ్చుకుపోగా.. తొక్కసలాట చోటుచేసుకుంది. ఈ హృదయ విదారక సంఘటనలో 11 మంది మరణించగా.. 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. బౌరింగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లను పరామర్శించిన సీఎం సిద్ధరామయ్య నష్టపరిహారం(Exgratia) ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని.. గాయపడిన వాళ్లకు ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ మృతులకు రూ.2 లక్షలు, గాయపడినవాళ్లకు రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆర్సీబీ యాజమాన్యం కూడా గురువారం తొక్కిసలాట ఘటనపై విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని వెల్లడించింది.

## తొక్కిసలాట మృతులకు ఆర్థిక సాయం.. కీలక ప్రకటన చేసిన ఆర్‌సీబీ

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట (stampede) ఘటన నేపథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (RCB) యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నష్ట పరిహారం ప్రకటించింది. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా గాయపడిన వారి సహాయార్థం ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. 'నిన్న బెంగళూరులో జరిగిన దురదృష్టకర ఘటన ఆర్‌సీబీ కుటుంబానికి తీవ్ర బాధను కలిగించింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన 11 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం. అంతేకాదు, గాయపడిన అభిమానులను ఆదుకునేందుకు ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తాం' అని ఆర్‌సీబీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందచేస్తామని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం అందజేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం వెల్లడించారు. పద్దెనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ టైటిల్‌ని గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును సత్కరించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని కర్ణాటక ప్రభుత్వం బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీవ్ర విషాదాంతమైన విషయం తెలిసిందే. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట (stampede) జరిగి 11 మంది మరణించగా, సుమారు 50 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని, ముందు జాగత్తగా తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఆరోపించింది. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీ స్థాయిలో క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. పాసులు, టికెట్లు ఉన్న వారినే లోపలకు అనుమతించాల్సి ఉన్నప్పటికీ తమ ఆర్‌సీబీ హీరోలను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో స్టేడియం ప్రాంగణం ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది.

## ఘనంగా క్రికెటర్ కుల్‌దీప్ యాదవ్ ఎంగేజ్మెంట్



భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలైన వంశికను వివాహం చేసుకోబోతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం వీరి ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది. లఖ్నోలో జరిగిన నిశ్చితార్థ వేడుకలో స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో కాబోయే కొత్త జంట ఉంగరాలు మార్చుకుంది. ఇక వీరి వివాహం త్వరలోనే జరగనున్నట్లు తెలుస్తోంది. కాగా, కుల్‌దీప్ యాదవ్, వంశిక చిన్ననాటి స్నేహితులు. స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో ఇరువురి కుటుంబసభ్యుల అంగీకారంతో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. దీంతో వీరి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. త్వరలోనే వీరి వివాహం కూడా జరగనుంది. వంశిక ప్రస్తుతం ఎల్ఐసీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరి ఎంగేజ్మెంట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మరోవైపు త్వరలో ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌కు కుల్‌దీప్ ఎంపికైన విషయం తెలిసిందే.

## తొలి టెస్టుకు అట్కిన్సన్ అనుమానమే!




**లండన్:** ఈనెల 20 నుంచి స్వదేశంలో భారత్‌తో జరుగబోయే ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ బౌలర్లు వరుసగా గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఆ జట్టు పేసర్లు మార్క్ వుడ్, ఒలీ స్టోన్ గాయాలతో సతమతమవుతుండగా తాజాగా మరో బౌలర్ గస్ అట్కిన్సన్ కూడా తొడ కండరాల గాయంతో భారత్‌తో తొలి టెస్టులో ఆడేది అనుమానంగానే ఉంది. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో గాయపడ్డ అట్కిన్సన్.. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరో మూడు వారాల కంటే ఎక్కువ సమయం పట్టే అవకాశమున్నట్టు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వర్గాలు తెలిపాయి.

## తెలంగాణలో ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీ!
### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




**మహా:** తెలంగాణలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది, పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, మహిళా భద్రత విభాగం, సీఐడీ అదనపు డీజీగా చారు సిన్హా, ఎఫ్ఎస్ ఎల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా శిఖా గోయల్‌ను నియమించారు. హైదరాబాద్ సిటీ ఎస్‌బీ డీసీపీగా ఉన్న ఎస్.చైతన్యకుమార్‌ను సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా నియమించగా, ఆ పదవిలో ఉన్న పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. మైనారిటీ వెల్ఫేర్‌లో ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న తఫ్సీర్ ఇక్బాల్‌ను చార్మినార్ రేంజ్ డీఐజీగా, మెదక్ ఎస్పీగా డీవీ శ్రీనివాసరావును బదిలీ చేశారు.



# స్టార్ హీరోతో లోకేష్ కనగరాజ్ కొత్త సినిమా ప్రకటన

**బాలీవుడ్ అగ్ర హీరో ఆమిర్ ఖాన్ , తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈమేరకు తాజాగా అధికారికంగా ప్రకటన వచ్చేసింది. కోలీవుడ్‌లో విక్రమ్, లియో, ఖైదీ, మాస్టర్ వంటి సినిమాలతో టాప్ దర్శకుడిగా దేశవ్యాప్తంగా లోకేష్ కనగరాజ్ పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన తొలిసారి ఒక బాలీవుడ్ సినిమాను తెరకెక్కించనున్నారు.**

ఆమిర్ ఖాన్ తన కొత్త సినిమా 'సితారే జమీన్ పర్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోకేశ్ కనగరాజ్‌తో తాను ఒక సినిమా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే చర్చలు కూడా పూర్తి అయ్యాయి అని తెలిపారు. అత్యంత భారీ స్థాయిలో యాక్షన్ ఎపిసోడ్స్ ఇందులో ఉంటాయని ఆయన అన్నారు. సూపర్‌హీరో జానర్‌లో స్టోరీ ఉంటుందని హింట్ ఇచ్చారు. అయితే, వచ్చే ఏడాది జూన్‌లో ఈ చిత్రం ప్రారంభం అవుతుందని తెలిపారు. రెండేళ్ల తర్వాత ఈ సినిమా గురించి చర్చించుకుందామని ఆమిర్ ఖాన్ సూచించారు. 'పీకే 2' సినిమా గురించి సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆమిర్ ఖాన్ అన్నారు. పీకే2 సినిమా చేయాలనే ఆలోచన లేదని ప్రకటించారు. అయితే, 'దాదా సాహెబ్ ఫాల్కే 'పై సినిమా చేస్తున్నామని, రాజ్ కుమార్ హిరాణీతో చర్చలు జరుగుతున్నాయిని చెప్పారు. 'మహాభారతం'పై సినిమా చేయాలనేది తన 25 ఏళ్ల డ్రీమ్ అంటూ ఆమిర్ ఖాన్ తెలిపారు. అదొక యజ్ఞంలా చేయాలనే ఆలోచన ఉంది. చర్చలు అయితే జరుగుతున్నాయి. త్వరలో మరిన్ని విషయాలు చెబుతానని ఆమిర్ అన్నారు.

ఇదిలా ఉంటే.. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో ఆమిర్ ఖాన్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారనే టాక్ కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ తర్వాత లోకేష్ మరో కొద్దిరోజులు గ్యాప్ తీసుకుని ఆమిర్ సినిమా చేయనున్నారు.



# నీ మంచితనం నాకు తెలుసు.. చివరిచూపు చూసుకున్న హీరోయిన్

హీరోయిన్, మెగా ఫ్యామిలీ కోడలు లావణ్య త్రిపాఠి తీవ్ర బాధలో ఉంది. ఆమె ఎంతగానో ఇష్టపడే పెంపుడు శునకం మరణించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. నేను చూసిన శునకాల్లో అన్నింటికంటే నువ్వే ఎంతో మంచిదానివి. నీకు శక్తి ఉండుంటే నాకోసం టీ పెట్టడానికి కూడా వెనకాడవని నా చుట్టూ ఉండేవాళ్లకు ఎప్పుడూ నీ గురించి చెప్తుంటాను.

## ఎంత మంచిదానివో..

నీదెంత మంచిమనసో నాకు తెలుసు. నువ్వు చాలా మంచిదానివి. అలాగే తెలివైనదానివి స్వీటీ అని రాసుకొచ్చింది. తన శునకంతో కలిసున్న ఫోటోలను షేర్ చేసింది. ఈ పోస్ట్ కింద సాయిదుర్గ తేజ్ ఓం శాంతి అని కామెంట్ చేశాడు. ఈ విషయం తెలిసిన అభిమానులు.. లావణ్యను ధైర్యంగా ఉండమని చెప్తున్నారు.


## త్వరలోనే తల్లి కాబోతున్న లావణ్య

కాగా లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్ 2023లో పెళ్లి చేసుకున్నారు. గత నెలలోనే లావణ్య.. తాను గర్భం దాల్చినట్లు గుడ్‌న్యూస్ చెప్పింది. సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆమె చేతిలో సతీ లీలావతి సినిమా ఉంది.



# చెట్టును ఆలింగనం చేసుకున్నా.. అది కూడా తిరిగి నన్ను..

హీరోయిన్ నభా నటేష్ .. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను... ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతిని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్‌కు రుణపడి ఉంటాను అని రాసుకొచ్చింది. ఇది చూసిన నెటిజన్లు ప్రకృతి గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందని కామెంట్స్ చేస్తున్నారు. ఇకపోతే నభా నటేష్.. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో నాగాభరణం అనే మూవీలో నటిస్తోంది. ఈ రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలుగా రూపొందుతున్నాయి. త్వరలో స్వయంభు, నాగాభరణం సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. మరికొన్ని క్రేజీ చిత్రాలు నభా లైనప్ లో ఉన్నాయి.



# ఎన్టీఆర్ – నీల్ ప్రాజెక్ట్.. స్మశానంలో 2 వేల మందితో మెగా యాక్షన్ సీన్!

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. #NTRNeel అంటూ రానున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలావుంటే ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి కీలక అప్‌డేట్ ఒకటికి బయటకు వచ్చింది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుపుకుంటుండగా.. స్మశానంలో 2000 మంది జూనియర్ ఆర్టిస్ట్‌లతో ఒక భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. తారక్ కెరీర్‌లో మునుపెన్నడూ చూడని విధంగా ఈ ఎపిసోడ్ ఉండబోతుందని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 2026 జూన్ 25న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

# పెళ్లైన తగ్గేదే లే అంటున్న అక్కినేని కోడలు..

## నైట్‌వేర్‌లో రచ్చ చేస్తుందిగా..!

తెలుగు రాష్ట్రాల నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు ఇండస్ట్రీకి వస్తున్నారు. కాని అందులో కొందరు మాత్రమే తమ టాలెంట్‌తో నిలబడుతున్నారు. వారిలో తెనాలి అమ్మాయి శోభిత ధూళిపాళ్ల కూడా ఒకరు. ఆరంభంలోనే అందాలతో మాయ చేసిన ఈ చిన్నది.. దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకుంది. టీనేజ్‌లోనే మోడలింగ్ రంగంలోకి వెళ్లిన శోభిత 2013లో జరిగిన మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని తృటిలో కిరీటాన్ని చేజార్చుకుంది. ఇక అదే ఏడాది మిస్ ఎర్త్ ఇండియా అందాల పోటీల్లోనూ కంటెస్టెంట్‌గా పాల్గొంది. దాంతో శోభితకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది.

'రామన్ రాఘవ్ 2.0' అనే హిందీ చిత్రంతో నటిగా మారిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత 'చెఫ్', 'కళాకంది' వంటి బాలీవుడ్ చిత్రాలలో నటించింది. ఇక అడివి శేష్ 'గూఢచారి' మూవీతో శోభిత ధూళిపాళ్ల టాలీవుడ్‌లోకి వచ్చింది. ఈ సినిమాలో తన అందం, పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టింది. ఈ సినిమా హిట్ అయిన శోభితకి తెలుగులో పెద్దగా అవకాశాలు రాలేదు. చాలా రోజుల తర్వాత 'మేజర్'తో తెలుగు చిత్రంలో కనిపించి మెప్పించిన కూడా..ఎందుకో ఈ అమ్మడికి అవకాశాలు ఇవ్వడం లేదు. శోభిత తన కెరీర్‌లో అదిరిపోయే హాట్ షో చేసింది. అలాగే, రొమాంటిక్ సీన్స్‌లోనూ నటించింది. 'మంకీ మ్యాన్' అనే హాలీవుడ్ మూవీలో ఈ చిన్నది వేశ్య పాత్రలో కనిపించింది. గ్లామర్ షోకు చిరునామాగా శోభిత ధూళిపాళ్ల ఎన్నో ఏళ్లుగా రచ్చ చేస్తుంది. అక్కినేని నాగ చైతన్యని వివాహం చేసుకొని అక్కినేని కోడలిగా మారాక కూడా శోభిత అందాలను ఆరబోస్తూ రచ్చ లేపుతోంది. ఇందులో భాగంగానే తనదైన గ్లామర్‌ను చూపిస్తూ తీసుకున్న హాట్ హాట్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. తద్వారా ఈ బ్యూటీ తరచూ ట్రెండ్ అవుతూ నేషనల్ వైడ్‌గా హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉంటుంది. శోభిత ధూళిపాళ్ల తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో నైట్ వేర్ డ్రెస్ ధరించి రచ్చ లేపుతుంది. శోభిత షేర్ చేసిన ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చి పిక్స్ వైరల్‌గా మారుతున్నాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ఈనెల 12న పాఠశాలలు
# పునః ప్రారంభం

**పరిసరాల పరిశుభ్రత మౌలిక సదుపాయాలు ఏర్పాటు**

ఎంపీడీవో సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

11వ తారీకు నాటికి పాఠశాలలను తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభమవుతున్నందున 11వ తేదీ నాటికి పాఠశాలలు హాస్టల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాఠశాలలు, హాస్టల్లో మౌలిక సదుపాయాలు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి వసతి పై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడి కేంద్రాలు ఈనెల 12న ప్రారంభం అమవుతున్న సందర్భంగా ఆయా శాఖల సంక్షేమ అధికారులతో చిన్నచిన్న సమస్యలు ఉంటే ఖర్చు చేసి పరిష్కరించాలని, ఆవరణలలో పరిశుభ్రత, తాగునీటి వసతి, ఎలక్ట్రికల్ పనులు వెంటనే చేపట్టాలని దానికి సంబంధించి నిధులు వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో సరిపడా సరుకులు, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పై మాట్లాడుతూ ఇంకా గ్రౌండింగ్ కానీ ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ యాప్ లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం పై కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు యూనిట్ ఎంపిక లో అందరూ ఒకే విధమైన యూనిట్లు జనరల్ స్టోర్స్ కాకుండా ప్రతి గ్రామంలో ఒకే యూనిట్ ఉండకుండా బార్బర్ షాప్, టెంట్ హౌస్ లాంటివి వేరే వేరే యూనిట్లు ఉండాలని మహిళలకు బ్యూటీ పార్లర్లు ఎంపిక చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ త్రాగునీటి కొరత రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎక్కడైనా త్రాగునీటి సమస్య ఉంటే వెంటనే పునరుద్ధరించాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్ఓ సంగీత, డిఆర్డీఎ పిడి శ్రీలత, హౌసింగ్ పిడి హన్మంతు నాయక్, జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ మురిపెం..

## మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ

వర్షాకాలం నేపథ్యంలో సర్కారు నిర్ణయం

రేషన్ దుకాణాల వద్ద లబ్దిదారుల బారులు

ఈనెలాఖరు వరకు అందిస్తామని చెబుతున్న అధికారులు

**ఆదిలాబాద్, మహా**

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వం ఉచిత రేషన్ బియ్యం అందిస్తోంది. రానున్న వర్షాకాలం నేపథ్యంలో నిరుపేదలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా మూడు నెలలకు సంబంధించి కోటాను ఒకేసారి పంపిణీ చేస్తోంది. దీంతో అనేక మంది లబ్దిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో అధిక వర్షాల కారణంగా ఏదైనా అనుకోని విపత్తులు సంభవిస్తే ఈ బియ్యం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మరోపక్క లబ్దిదారులు ఒకేసారి అధిక సంఖ్యలో ఆయా రేషన్ దుకాణాలకు వస్తుండటంతో రద్దీ నెలకొంటోంది. ప్రతి నెలా 15వ తేదీ వరకే బియ్యం పంపిణీ చేస్తుండగా.. ఈ నెల మాత్రం 30వ తేదీ వరకు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ నిల్వలు ఎక్కడ ముగిసిపోతాయోననే ఆందోళనతో దుకాణాలకు పరుగులు పెడుతుండటం కారణంగా పంపిణీలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోందని డీలర్లు చెబుతున్నారు. మరోపక్క పెద్ద మొత్తంలో నిల్వ చేసుకోవడం కూడా సమస్యగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షా కాలం నేపథ్యంలో..**

ప్రతి ఏటా అధిక వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరదలు రావడం సాధారణంగా మారింది. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లడం..దారులు కొట్టుకుపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. దీంతో అనేక గ్రామాల ప్రజలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకోవడం ఇబ్బందిగా మారుతోంది.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాకాలంలో మరింత దయనీయ పరిస్థితులు కనిపిస్తుంటాయి. జిల్లాలో అధికంగా మారుమూల ప్రాంతాలు ఉండటం.. ఎక్కవగా పంచాయతీలో రేషన్ దుకాణాలు ఉండటంతో వాటి అనుబంధ పల్లెలు వీటి వద్దకు వచ్చి రేషన్ బియ్యం తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఏకధాటిగా వర్షాలు కురుస్తుండటం ..దారులు బాగాలేక వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అనేక మంది బియ్యం తీసుకోలేని పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది అలాంటి పరిస్థితి ఎదురుకాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ముందస్తుగానే జూన్, జులై, ఆగస్టుకు సంబంధించి బియ్యం కోటాను లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాది వర్షాలు ముందుగానే రావడం.. అధిక వర్షాలు ఉంటాయనే వాతావరణశాఖ హెచ్చరిక కూడా ఓ కారణమని అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**చాలా మంచి నిర్ణయం**

ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయం చాలా బాగుంది. వర్షా ల నేపథ్యంలో ముందస్తుగానే మూడు నెలల బియ్యం కోటా అందించడంతో నిరుపేదలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. వర్షా ల కారణంగా బియ్యం తీసుకునే ఇబ్బందులు దూరమవుతాయి. - వినయ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి

**దుకాణాలకు చేరుకుంటున్న బియ్యం**

ఆదిలాబాద్ జిల్లాలో 1,92,727 మంది లబ్దిదారులు ఉండగా కొత్తగా 995 మంది రేషన్ కార్డులు పొందారు. వీరికి మూడు నెలల కోటాకు సంబంధించి 12వేల మెట్రిక్ టన్నుల కోటా అవసరమని అధికారులు గుర్తించారు. ఇందుకు అవసరమైన బియ్యాన్ని నిజామాబాద్ జిల్లా నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 3700 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు చేరుకోగా.. గురువారం రోజున మరో పది లారీల వరకు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇలా రోజువారీగా అక్కడి నుంచి బియ్యాన్ని తీసుకొస్తూ రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. పూర్తి కోటా చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

**లబ్దిదారులు ఆందోళన చెందొద్దు**

వర్షా కాలం నేపథ్యంలో ప్రభుత్వం మూడు నెలల కోటాను ఈ నెలలోనే పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం జిల్లాకు రోజువారీగా బియ్యం చేరుకుంటోంది. ఈ నెలాఖరు వరకు పంపిణీ చేస్తాం. లబ్దిదారులు ఎవరూ ఆందోళన చెందకూడదు. అర్హులైన లబ్దిదారులు అందరికీ బియ్యం పంపిణీ చేస్తాం. - వాజిద్ అలీ, డీఎస్ఓ, ఆదిలాబాద్



**ముందస్తు బియ్యంతో మేలు**

ప్రభుత్వం ముందస్తుగానే మూడు నెలలకు సరిపడా సన్నం బియ్యం అందించడం చాలా బాగుంది. బియ్యం అందించే సమయంలో వర్షా లు కురిస్తే చాలా మంది సమయానికి తీసుకోలేని పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాదు. అనేక మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుంది. - గురుడు వంశీ, లబ్దిదారుడు

## రాత్రికి రాత్రి నాటు కోళ్ల షెడ్డుపై కుక్కల దాడి..!

**250 కోళ్లు మృత్యువాత**

**ఆందోళనలో రైతు**

- సుమారు రెండు లక్షల వరకు నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నాటు కోళ్ల షెడ్డు పై కుక్కల దాడిలో 250 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఆందోళనలో రైతు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు. షాద్ నగర్ నియోజకవర్గం, నందిగామ మండలం, రంగాపూర్ గ్రామానికి చెందిన వనపల్లి మల్లేష్ స్వయం ఉపాధి పొందడానికి షెడ్డు ఏర్పాటు చేసుకొని నాటు కోళ్ల పెంపకాన్ని చేపట్టారు. షెడ్డులో దాదాపు 250కి పైగా నాటు కోళ్లను పెంచి వాటిని మృగశిర కార్తెను పురస్కరించుకొని మార్కెట్లో మంచి డిమాండ్ తో అమ్మేందుకు పెంపకాన్ని చేపట్టారు. బుధవారం రాత్రి షెడ్డులోకి కుక్కలు ప్రవేశించి మొత్తం నాటు కోళ్లను దొరికినవి దొరికినట్టుగా కొరికి చంపాయి. మరికొన్ని కోళ్లు బయటికి తప్పించుకోగా వాటిని కూడా వెంటాడు వేటాడి చంపేశాయి. దీంతో కోళ్ళ కళేబరాలు పలుచోట్ల చిందరవందరగా పడిపోయాయి. మల్లేష్ కు సుమారు 2 లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.



## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్**

**ఆదిలాబాద్, మహా:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక డీ.ఎఫ్.వో కార్యాలయం నుండి చేపట్టిన ర్యాలీని డీఎఫ్ఓ ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని సంరక్షించాలని నినాదాలు చేస్తూ ర్యాలిలో పాల్గొన్నారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధానికి తమ శాఖా తరపున వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులోనూ ప్లాస్టిక్ ను నిషేధించినట్లు పేర్కొన్నారు. జలపాతాల వద్ద సైతం సింగిల్ యూస్ ప్లాస్టిక్కు తీసుకెళ్లకుండా అంక్షలు విధించామని చెప్పారు.

## బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

**కాటారం డి.ఎస్.పి.జి రామ్మోహన్ రెడ్డి**



**కాటారం, మహా :** కాటారం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ముస్లిమ్స్ సోదరులందరూ బక్రీద్ పండుగను శాంతియుతంగా వాతావరణం మధ్య జరుపుకోవాలని కాటారం డి.ఎస్.పి.జి రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ లో బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించనైనది. కాటారం డి ఎస్ పి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగను సంతోషంగా జరుపు కోవాలి అని, పండుగ సందర్భంగా ఇలాంటి హింసకు తావు లేకుండా, శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలన్నారు. మహాదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్,మహాదేవపూర్ ముస్లిం పెద్దలు హాజరైనారు.

## బడిబాటను విజయవంతం చేయాలి



**ఆదిలాబాద్, మహా:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తి చర్యలు తీసుకోవాలని రూరల్ ఎంఈఓ కంటే నర్సయ్య సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం హెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న బడిబాట కార్యక్రమానికి సంబంధించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆరేళ్ళ నుండి 14 సంవత్సరాలోపు పిల్లలు తప్పని సరిగా బడిలో ఉండేల చూడాలని, ఉపాధ్యాయులు, క్షేత్ర స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. మన ఊరు మన బడి లో భాగంగా ప్రభుత్వ పాటశాలల్లో అవసరమైన మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించినట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలను అందించడంతో పాటు డిజిటల్ బోధనా సైతం అందుతోందని వివరించారు.



## పోలీసు జాగిలాల కోసం స్విమ్మింగ్ పూల్

**ఆదిలాబాద్, మహా** పోలీసు జాగిలాల సంరక్షణలో భాగంగా వాటి కోసం ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. డాగ్ స్క్వాడ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా పోలీసు జాగిలాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలు చేసి పూల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాగిలాలతో స్విమ్మింగ్ చేయించడం ఆకట్టుకుంది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కేసులు పురోగతి సాధించాలంటే డాగ్ స్క్వాడ్ బృందాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జాగిలాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నామని పేర్కొన్నారు. విపరీతమైన ఎండల నేపథ్యంలో వాటికి ఉపశమనం కలిగించేందుకు స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేశామని వివరించారు.

## గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు.!

**ఫరూఖ్ నగర్ ఈద్గా వద్ద**

**గంజాయి పట్టివేత**

- సీజైనా గంజాయి ఎక్సైజ్ కార్యాలయం నుంచి బయటకు
- తాండూర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ నిర్వాకం
- బంధువుల సాయంతో గంజాయి అమ్మకాలు
- అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసిన పోలీసులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** షాద్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీజ్ అయిన గంజాయిని బయటకు తీసి ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ తన బంధువు ద్వారా విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. షాద్ నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలోని ఫరూఖ్ నగర్ ఈద్గా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అంజద్ అనే యువకుడి చేతిలో కవర్ అనుమానాస్పదంగా కనిపించిందని. దీంతో యువకుడిని తనిఖీ చేయగా 1.5 కిలోల గంజాయి లభించిందని పేర్కొన్నారు. ఈ కేసులో ఎక్సైజ్ కానిస్టేబుల్ గులాం సుల్తాన్ అహ్మద్ తో పాటు అంజద్ అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ట్రాన్స్ జెండర్ కు ప్రభుత్వ ఉద్యోగం



**ఆదిలాబాద్, మహా:** కారుణ్య నియామకాల్లో రాష్ట్రంలో తొలిసారిగా ట్రాన్స్ జెండర్ కు అటెండర్ ఉద్యోగం లభించింది. పట్టణంలోని దస్నాపూర్ హనుమాన్ కాలనీ కి చెందిన పద్మ జెడ్పీ లో అటెండర్ గా విధులు నిర్వహిస్తూ 2024 లో తనువు చాలించారు. కాగా... ఆమె సంతానమైన సి.హెచ్ అర్చనకు ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ గా ఉద్యోగం కేటాయించారు. గురువారం నుండి ఆమె విధుల్లో చేరారు. ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ లను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానం కల్పించడం పట్ల సి.హెచ్ అర్చన హర్షం వ్యక్తం చేశారు. తన తల్లి మరణించడం తో తనకు ఉద్యోగం వచ్చిందని పేర్కొన్నారు. ట్రాన్స్ జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. తనకు ఉద్యోగం రావడంలో సహకరించిన అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేశారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, మహా :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్కు చెక్ పెట్టండి - పర్యావరణాన్ని కాపాడండి అనే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈ సంవత్సరం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) ఆధ్వర్యంలో ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వచ్చే అనారోగ్య సమస్యపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పర్యావరణ ప్రాధాన్యత, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే అంశాలపై మరింత ఫోకస్ చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టం గురించి వివరించారు. ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయాలను ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఓ వీరభద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, పౌర సరఫరాల అధికారి శ్రీనాద్, కెటిపిపి ఎస్ ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

**జూన్ 6 నుండి గ్రామాల్లో బడిబాట**

విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జూన్ 6 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై విద్యా, సంక్షేమ శాఖలు, డిఆర్డీఓ, పంచాయతి, కార్మిక, మున్సిపల్, మెప్మా తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో "బడిబాట" కార్యక్రమాన్ని జూన్ 6 నుండి 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కు 6 నుండి 19వ తేదీ వరకు తయారు చేసిన షెడ్యూల్ ప్రకారం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇవన్నీ ప్రజలకు తెలియచెప్పి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలాలల్లో విద్యార్థుల నమోదులు పెంచాలన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విద్యకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

# రైతులను మోసం చేస్తే సహించేది లేదు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.. రైతుల వేషధారణలో వెళ్లి 34మందిని పట్టుకున్న పోలీసులు**

**ఆదిలాబాద్, మహా:** రైతులను మోసం చేస్తే సహించేది లేదని, ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను దుర్వినియోగం చేస్తూ రైతుల వద్ద నుండి డబ్బులను దండుకుంటున్న దళారుల పట్ల యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 9 మండలాలలో జిల్లా పోలీసులే రైతుల వేషధారణలో 16 బృందాలుగా ఏర్పడి బ్యాంకులకు వెళ్లారు ల్. రైతులను మోసం చేయాలనే నేరస్వభావం కలిగిన దళారులు పోలీసులతో బేరసారాలు చేయడం, రైతు రుణమాఫీ తామే కట్టి ఎక్కువ రుణాన్ని కేటాయించి వచ్చిన దానిలో తమకు వాటా ఇయ్యాలని బేరసారాలు ప్రారంభించారు. ఇలా జిల్లాలోని వివిధ బ్యాంకుల వద్ద రైతులను మోసం చేస్తున్న 34 మంది దళారులను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఏర్పాటు చేసిన బృందాలలో జిల్లా పోలీసులు స్వయంగా రైతుల వేషాలలో ఉండటం గమనార్హం. బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని దళారులు, మధ్యవర్తులను రైతులకు దూరంగా ఉండే విధంగా సూచనలు అందించాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, నేరడిగొండ, ఇచ్చోడా, బేల, తలమడుగు, భీంపూర్, మావల, ఇంద్రవెల్లి ప్రాంతాలలో జిల్లా పోలీసులు స్వయంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి 34 మంది నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. వారందరిపై ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో సెక్షన్ 318 ప్రకారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

